నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
వరంగల్-ములుగు
సోమవారం | జులై 15, 2024 | www.navatelangana.com

మెపా ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ

నవతెలంగాణ-కాశిబుగ్గ

ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (మెపా) ఆధ్వర్యంలో ఆదివారం గురుకుల విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధి ఆరేపల్లి సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో చదువుతున్న హైస్కూల్, ఇంటర్ విద్యార్థులకు చరిత్ర, ఎకనామిక్స్, జీకే పుస్తకాలను అందించినట్లు తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండే పోటీ తత్వం అలవాటు పడాలని నీట్, ఎంసెట్ లాగానే పాఠశాల స్థాయి నుండే ప్రభుత్వం సివిల్స్ కోచింగ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి, మెపా రాష్ట్ర కార్యదర్శులు సంగారపు రామకష్ణ, దండు చిరంజీవి, నీరటి రాజు జిల్లా నాయకులు శ్యామ్, రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



వికలాంగులకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

నవతెలంగాణ-చెన్నారావుపేట

వికలాంగులకు కార్పొరేషన్‌లో రాష్ట్ర, జిల్లా డైరెక్టర్ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ వికలాంగుల రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పాలకొండ కుమారస్వామి కోరారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ముత్తినేని వీరయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో కష్ట పడి పని చేసిన వారికే నామినేటెడ్ డైరెక్టర్ పోస్టులు ఇవ్వాలని కోరారు. దివ్యాంగుల సమస్యలపై చర్చించి, ప్రతి సంవత్సరం బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయించాలని కోరారు. పలు విషయాలపై సానుకూలంగా స్పందించి రాబోయే స్థానిక ఎన్నికలల్లో, అన్ని సంక్షేమ పథకాలలో 5శాతం రిజేర్వేషన్ అమలు చేయిస్తానని తెలిపారు. ప్రతి నెలా 10వ తేదీలోపు పింఛన్లు ఇచ్చేలా సీఎం దష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని పల్లకొండ కుమారస్వామి కోరారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు కాంగ్రెస్-వికలాంగుల విభాగం అసెంబ్లీ ఇంచార్జి సయ్యద్ అసద్, నర్సంపేట ఇంచార్జి ఆకారపు శ్రీను, మాజీ ఎంపీటీసీ ధరవత్ భద్రు, జిల్లా నాయకులు కూస సుదర్శన్, మాదాసు సుధాకర్, వివిధ మండల కన్వీనర్లు అడ్డురి వీరచారి, పులి రమేష్, ఎండీ ఫయాజ్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి : సీఐ

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని పసర సీఐ జి రవీందర్ అన్నారు. ఆదివారం మండలంలోని పసర గ్రామపంచాయతీ కార్యాలయంలో జ్వాలా ట్రస్ట్ మంగపేట ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సిఐ జి రవీందర్, ఎస్ఐ కమ లాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం అవసరం ఎంతగానో ఉందని ఎంతోమందికి ప్రాణాన్ని కాపాడడంలో రక్తదానం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. మంగపేట జ్వాలా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మండల మెడికల్ అసోసియేషన్ సహకారం అందించడం హర్షనీయమన్నారు. ఈ శిబిరంలో 42 మంది యువకులు రక్తదానం చేశారు. జ్వాల ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ట్రస్ట్ ముందుకు వస్తుందని, అందుకు స్థానికుల సహకారం అవసరమని కోరారు. కార్యక్రమంలో జ్వాలా ట్రస్ట్ జనరల్ సెక్రటరీ మునిగాల రాకేష్, గౌరవ సలహాదారు ఈక రాజేష్, కార్యవర్గ సభ్యులు ఎండీ ఇంతియాజ్, బి కార్తీక్, రోహిత్, సాయి తేజ, మండల వర్తక సంఘం అధ్యక్షులు బూర నరేందర్ మండల మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు మధు, ఉపాధ్యక్షులు సదానందం, కార్యదర్శి ధనుంజయ లతోపాటు అసోసియేషన్ సభ్యులు, పోలీసు సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, యువత పాల్గొన్నారు.



కెఎస్ఎన్ రాజు మృతి తీరని లోటు

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్

నవతెలంగాణ వాజేడు

రోడ్డు ప్రమాదంలో కెఎస్ఎస్ రాజుతో పాటు ఆయన భార్య, కుమార్తె మృతి చెందడం బాధాకరమనిసీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ అన్నారు. కెఎస్ఎన్ రాజు, అతని భార్య మృతదేహాలకు ఎర్రజెండా కప్పి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం బండారు రవికుమార్, సూడి కృష్ణారెడ్డి, యలమంచిలి రవికుమార్ మాట్లాడుతూ మండలంలోని పేదప్రజల కోసం అనునిత్యం పోరాటం చేసిన వ్యక్తి కెఎస్ఎన్ రాజు అని, కూలీ రెట్ల కోసం, రైతంగా సమస్యలపై మండలంలో పోరాటం చేసారని గుర్తు చేశారు. తన ఇంటినే రాజకీయ పాఠశాలగా చేసి అనేకమంది నాయకులకు కేంద్రం అయిందని, అనేక మందికి అన్నం పెట్టి బాగోగులు చూసుకునే వారని ఆయన సతీమణి సత్యవతి కూడా సీపీఐ(ఎం) పార్టీ కోసం అంకితభావంతో శ్రమించేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, ములుగు, భద్రాద్రి జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి, బ్రహ్మాచారీ, తిలక్, రత్నం రాజేందర్, ఎండీ దావుద్, మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు, గుగ్గిళ్ల దేవయ్య, జెజ్జరీ దామోదర్, బచ్చల కష్ణబాబు పాల్గొన్నారు.



ముదిరాజ్‌ల సమస్యలు పరిశీలించాలి

జిల్లా అధ్యక్షులు బొల్లు దేవేందర్ ముదిరాజ్

నవతెలంగాణ-ములుగు

ములుగు జిల్లాలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్ ఆధ్వర్యంలో ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌లో ముదిరాజ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముదిరాజ్‌ల సమస్యల పట్ల వివిధ మండల కేంద్రాలలో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ ముదిరాజ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు బండా ప్రకాష్ నాయకత్వంలో చేపటాల్సిన కార్యక్రమాలపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా నియోజక వర్గ ముదిరాజ్ మహాసభ ఇంఛార్జి చిటమట రఘు, ములుగు జిల్లా మత్య సొసైటీ అధ్యక్షులు సాధు రఘు,ములుగు ముదిరాజ్ మహాసభ జిల్లా ఇంఛార్జి షాన బోయిన వెంకట మల్లయ్య,జిల్లా మత్య సొసైటీ ఉపాధ్యక్షులు పులుగుజ్జుల వెంకన్న, జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పిట్టల వెంకట స్వామి, ఉపాధ్యక్షులు రెడ్డి నర్సయ్య,జిల్లా ముదిరాజ్ మహాసభ నాయకులు రెడ్డిగణపతి, మొర రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ములుగు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ములుగు ఎంపీడీవో ఆర్ రామకృష్ణ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీని సందర్శించి కాలనీవాసులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వధా చేయకూడదని ఇంకుడు గుంతలు, ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా బ్యాక్ యాడ్ పౌల్ట్రీ, పాడి గేదలు, చిన్న తరహా పరిశ్రమలు లోన్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఆసరా పింఛన్ అందరివారికి ఆధార్ కార్డు వివరాలు తెలుసుకొని వారికి త్వరలోనే ఆసరా పెన్షన్ వచ్చేలా చూస్తానని ఎంపీడీవో తెలిపారు.



పాకాల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి..

మోక్షమెప్పుడో..?

- కలగానే మారిన రైతన్నల ఆశలు
- ప్రమాదపుటంచులో ప్రజల ప్రాణాలు
- వాగవతలి రైతులకు తప్పని తిప్పలు
- నిధులు మంజూరైనా...
- ప్రారంభం కాని నిర్మాణ పనులు
- సమస్యల్ని పట్టించుకోని పాలకులు



నవతెలంగాణ-చెన్నారావుపేట

ఏండ్ల తరబడి రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రమాదపు అంచులో చెన్నారావుపేట వద్ద చలివాగులో నుంచి ప్రయాణం చేస్తున్నారు. వాగవతల పొలాలకు వెళ్లే రైతులు, మహిళా కూలీలు వర్షాకాలం సీజన్‌లో పనులకు వెళ్లాలంటే సర్కాస్ ఫీట్లు చేస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఎన్ని ప్రభుత్వాలు, పాలకులు మారినా చలివాగుపై బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడంతో పలు గ్రామాల ప్రజలు, రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల ప్రజలకు అనుసంధానమైన వంతెనలు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనల నిర్మాణం మంజూరు కోసం అధికారులు సర్వేలు చేపట్టినప్పటికీ నిర్మాణ పనులను ఇంతవరకు చేపట్టకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం వచ్చిందంటే ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించాల్సిందేనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నారావుపేట మండల కేంద్రం నుంచి ఖానాపురం మండల పరిధిలోకి ఆయా రైతులు పొలాలకు వెళ్లే మార్గంలో చెన్నారావుపేట గ్రామం వద్ద 2023లో సుమారు ఏడు కోట్ల యాభై లక్షల రూపాయలు బ్రిడ్జి నిర్మాణం కోసం మంజూరయ్యాయి. అయితే గత పాలకులు శంకుస్థాపన చేశారు నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో ఎన్నో కలలుగన్న రైతులు, ప్రజలకు బ్రిడ్జిపై ప్రయాణం కలగానే మిగిలిపోయింది. దీంతో పాకాల పెద్ద వాగు పరిసర గ్రామాల ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలను కొనసాగిస్తున్నారు. అధికంగా వ్యవసాయ రైతులు ఉండడంతో వారి వేదన వర్ణాతీతంగా మారింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వంలో పాలకులు వంతెనపై దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.వర్షాలు కురవగానే పాకాల పెద్దవాగులో నీటి ప్రవాహం పెరుగుతుంది. దీంతో రైతులకు వాగు దాటి పొలం పనులు చేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాగు కనీసం ఐదారు నెలలు ప్రవహిస్తోంది. దీంతో రైతులు, ద్విచక్ర వాహనదారులు ఈ వాగు దాటాలంటే నరకయాతన పడుతున్నారు.

వంతెన నిర్మించి తమ కష్టాలు తీర్చాలి : నాంపల్లి స్వామి (రైతు)



ప్రతి ఏటా పాకాల వాగు ఉప్పొంగడంతో కష్టాలు పడుతున్నాం. ఒక్కోసారి వాగులో వరద ప్రవహం ఎక్కువై ఎడ్లు సైతం వరదకు కొట్టుకు పోతుంటాయి. వాగవతలి పొలాలకు వెళ్లాలంటే ఎండ్లు, మేము వాగులో నుంచి ఈదుకుంటూ వెళున్నాం. ఇప్పటికైనా పాలకులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమ కష్టాలు తీర్చాలి.

'కరుణ శ్రీ'లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నెక్కొండ

మండల కేంద్రంలోని కరుణశ్రీ విద్యాలయంలో 2010-11విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. విద్యాబోధన చేసిన గురువుల సమక్షంలో పూర్వ విద్యార్థులు ఆనందంగా, ఆత్మీయంగా, సంతోషంగా, స్నేహ పూర్వకంగా విద్యాభ్యాసం నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కలిసి చదువుకున్న విద్యార్థులు ఉన్నత విద్యలను అభ్యసించి ఉన్నత ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానంలో ఉండాలన్నారు. కష్టసుఖాలలో కలిసి స్నేహపూర్వకంగా ఉండాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లే రావు ప్రణీత్, అల్లువాల అఖిల్, గోపగాని శ్రీకాంత్, నరేందర్, నవ్య, అపర్ణ, ఉపాధ్యాయులు వెంకన్న, గుండోజు ప్రసాద్, డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, కక్కెర్ల మల్లేష్, గోపి, ప్రవీణ్ పాల్గొన్నారు.



నాటుసారా స్థావరాలపై దాడులు

నవతెలంగాణ-పర్వతగిరి

వర్ధన్నపేట మండలంలోని కుమ్మరికుంట తండా, డీసీ తండా, గుబ్బేటి తండాలలో ఆదివారం నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్, పోలీసులు దాడులు నిర్వహించారు. సారా అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నాటు సారాయి అమ్ముతున్న దరావత్ గణేష్ వద్ద నుండి (10) లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు.



థియేటర్‌లో హత్య ప్రయత్నం చేసిన నిందితుడు అరెస్ట్

నవతెలంగాణ-పర్వతగిరి

ఈ నెల 12న సాయంత్రం 6.15గంటలకు వర్ధన్నపేట భారతీయ థియేటర్‌లో జరిగిన హత్య ప్రయత్నం చేసిన నిందితుడు ఊర కృష్ణను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన కళ్లెం విజయ్ కృష్ణ కూతురును ఇష్టపడుతున్నాడనే అనుమానంతో విజయ్‌ని చంపాలని కత్తితో దాడి చేసి పారిపోగా వర్ధన్నపేట పోలీసులు ఉప్పరపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఊర కృష్ణను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

15న హనుమకొండలో రైతు భరోసాపై మంత్రుల వర్క్‌షాప్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రైతు భరోసా పథక విధివిధానాలపై ఈ నెల 15న (సోమవారం) ఉదయం 10.30 గంటలకు హన్మకొండ సమీకత జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీవోసీ)లో నిర్వహించనున్నారు.ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యశాల (వర్క్‌షాప్)లో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ హోదాలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సితక్క పాల్గొననున్నారు. రైతు భరోసా విధివిధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను సేకరించనున్నారు.





జలదార సోయగం (బొగత) ప్రకతి నయాగారం

నవతెలంగాణ-వాజేడు

జలదారల సవ్వడులతో ప్రకతి (ప్రేమికుల) పర్యాటకుల కేరింతలతో తెలంగాణ నయాగరా జలపాతం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కొండలు, వాగులు, వంకలు దాటుతూ వచ్చిన నీటి ప్రవాహం వాజేడు మండలం చీకుపల్లి గ్రామ సమీపంలో ఉన్న బొగత (తెలంగాణ నయాగారగా) పేరుగాంచిన బొగత జలపాతం వద్ద 50అడుగుల ఎత్తు నుంచి నీటి ప్రవాహదారలు, తెల్లటి పాలనురుగులవలే జాలువారుతూ చూపరులను ఆకట్టుకుంటుంది. ప్రతి ఏటా వర్షాకాల సీజన్లో జలపాతాన్ని సందర్శించడానికి మూడు రాష్ట్రాల సుదూర ప్రాంతాల నుండి పర్యాటకులు వచ్చి పచ్చని ప్రకతి ఒడిలో ఉన్న జలపాత అందాలను చూసి మంత్ర ముగ్ధులవుతున్నారు. ప్రకతి ప్రేమికులు ఆదివారం సెలవు దినం కావడంతో జలపాత సందర్శనకు పిల్లాపాపలతో వచ్చి ఆనందంగా గడిపారు. జలపాత సందర్శనకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం, కనీస వసతులు కల్పించడంలో అటవీశాఖ విఫలమైందని పర్యాటకులు ఆందోళన చెందుతున్నారు.

ములుగు జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

- కలిసి కట్టుగా జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తాం
- ఎంపీ బలరాంనాయక్ ఆత్మీయ సన్మానసభలో మంత్రి సీతక్క

నవతెలంగాణ-ములుగు

కలిసి కట్టుగా పని చేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపిస్తామని, మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మనల్ని కన్న తల్లీతండ్రులను, మనం పుట్టిన ఊరును మర్చిపోవద్దని, ములుగు జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి సీతక్క అన్నారు. ములుగు మండలంలోని ఎంపీ బలరాం నాయక్ స్వగ్రామంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మానసభకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివద్ధి స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదవిలో లేకపోయిన, అప్పటి ప్రభుత్వం ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న నాయకుడు ఎంపీ పోరిక బలరాంనాయక్ అని కొనియాడారు. ప్రజల ఆశీస్సులతో మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలువడం హర్షనీయమన్నారు. కుట్రలు కుతంత్రాలు లేని బోలా శంకరుడు బలరాముడు అని కొనియాడారు. బలరాం నాయక్ కేంద్ర మంత్రిగా ఉన్నపుడే ములుగుకు 100పడకల ఆసుపత్రి, జాతీయ రహదారి వెడల్పు, కస్తూర్బా మోడల్ స్కూళ్లు, సబ్‌స్టేషన్‌లు, ఏటూరు నాగారం ముళ్లకట్ట బ్రిడ్జి నిర్మాణం ఇలా అనేక అభివద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి తాను మంత్రిగా, కేంద్రంలో ఎంపీగా బలరాంనాయక్ నియోజకవర్గ అభివద్ధికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖలఅధికారులు ఉద్యోగులు ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సేవా రంగంలో 'వినీత్'కు గౌరవ డాక్టరేట్

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని కల్లెడ శివారు ముంజాలకుంట గ్రామపంచాయతీ పరిధిలోని నరెంగ తండాకు చెందిన తేజావత్ వినీత్‌కు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన వారికి ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ 2024 సంవత్సరంలో గౌరవ డాక్టరేట్లతో పురస్కరించింది. తేజవత్ వినీత్‌కు ఈ నెల 13న డాక్టరేట్ పురస్కారం ప్రదానం చేశారు. వినీత్ మూడేండ్లుగా కరోనా సమయంలో పేదలకు నిత్యవసర సరుకులు, మాస్కులు శానిటైజర్లు అందించారు. పేదలకు ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించి వారిని చైతన్య పరచారు. దీంతో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్నందుకు సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా మండల ప్రజలు ఆయనను అభినందించారు.



ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

నవతెలంగాణ-ములుగు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా అధికారులు, 9మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓలు తప్పకుండా హజరు కావాల్సిందిగా ఆయన ఆదేశించారు.

చిన్నబోయినపల్లిలో మెగా ఉచిత వైద్య శిబిరం

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వైద్య సేవలు

నవతెలంగాణ-ఏటూరు నాగారం (ఐటీడీఏ)

ఏటూరునాగారం మండలంలోని చిన్న బోయినపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన తుమ్మ ప్రభాకర్‌రెడ్డి వైద్య వృత్తిలో కొనసాగుతుండగా సోదరులు శ్రీధర్‌రెడ్డి సంజీవ రెడ్డిలు సమాజంలో మంచి గుర్తింపు పొందారు. అయితే గ్రామానికి చెందిన తుమ్మ సాయిరెడ్డి కోమలలు గతంలో మతి చెందారు. వారి స్మాంకార్థం వారి కుమారులు ముగ్గురు కలిసి ప్రతి సంవత్సరం ఇలా వైద్య సేవలు నిర్వహిస్తూ ఉంటారు. వర్షాకాలం ప్రారంభమైనందున అంటూ వ్యాధులు విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా మెడికవర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సహకారంతో సుమారు 20 మంది వైద్యులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. సుమారుగా 500 మంది రోగులు పాల్గొనగా అవసరమైన వారికి ఉచితంగా స్కానింగ్ రక్త పరీక్ష లు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం అవసరం ఉన్నవారికి ఆసుపత్రి ఆధ్వర్యంలో హైదరాబాద్ పంపించి మెరుగైన వైద్య చికిత్సలు చేపిస్తామని వారు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి యాజమాన్యానికి అందులో పాల్గొన్న వైద్యులకు ముగ్గురు సోదరులు కతజ్ఞతలు తెలిపారు.



పట్టింపేది ?

- 50 ఏండ్లుగా బురద రోడ్లతో నరకయాతన
- హామీలు మరిచిన పాలకులు
- రోడ్డుపై నాట్లువేసి వినూత్న నిరసన

నవతెలంగాణ-చెన్నారవుపేట

మండల పరిధిలోని ఎల్లయ్యగూడెం గ్రామం గల మాధవనగర్ కాలనీ నుంచి తిమ్మరానిపహాడ్ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా బురదమాయమై రోడ్డుపై నడవలేని దుస్థితి నెలకొంది. ఈ రోడ్డును చూస్తే బురదగుంటలా తలపిస్తోంది. దీంతో గ్రామస్తులు ఆదివారం ఆ బురద రోడ్డుపై నాటు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రెండు గ్రామాలకు రాకపోకలు కొనసాగించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారని, వ్యవసాయ పనులకు వెళ్లే మహిళలు, రైతులు సైతం బురదలో నడవాలంటే నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 50ఏండ్లుగా ఈ రోడ్డు దుస్థితి ఇలాగే ఉందని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు రోడ్డు విషయమై మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారిపై సర్వే చేపట్టి నిర్మాణం చేపట్టాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో దొంతరబోన కొమ్మాలు, మంచాల సారయ్య, చిలుకూరి వీరస్వామి, పులి చేరు నరేష్ పులిచేరి పెద్దులు, చిలుపురి గణేష్, బోల బ్రహ్మయ్య నల్లగుంట వెంకన్న ,రూపక సుమన్, కాటా రామ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ

2

హనుమకొండ

సోమవారం జులై 15, 2024 www.navatelangana.com

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ కలిసిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే నాగరాజు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



ఆదివారం హైదరాబాదులోని గ్రంథాలయ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గా నియమితులైన డాక్టర్ రీయాజ్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిలు రియాజ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరివెంట హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి.వెంకట్రాం, నరసింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ రైతుల అభివృద్ధికి అభ్యున్నతికి కృషి చేస్తా..



తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీబీ బ్యాంకును ఎలా అభివృద్ధి చేశానో రైతులకు రైతు కూలీలకు ఎలా సహాయం చేశానో అలాగే ఆయిల్ ఫామ్ రైతులకు కూడా సహాయం చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండ మండలం టేకులగూడెం గ్రామంలో రాఘవరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయిల్ ఫామ్‌ను తాను కూడా సాగు చేస్తున్నానని వరికంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. ఆయిల్ ఫామ్ ద్వారా ఎకరాకు రూ.1 లక్ష 50 వేల నుంచి రూ.1 లక్ష 80 వేల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఏవైనా ప్రైవేట్ కంపెనీలు రైతులను మోసం చేస్తే మేము రైతులకు అండగా ఉంటామని తెలిపారు. రైతులకు రవాణా, స్టోరేజీ, గిట్టుబాటు ధర వచ్చేట్లు చూస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కి మాట రాకుండా దేశంలోనే ఆయిల్ ఫామ్‌ను ఉన్నతంగా తయారు చేస్తామన్నారు. ఈఆయిల్ ఫామ్ పంటకు కోతుల బెడద గాని దొంగల బెడద ఉండదన్నారు. ఆయిల్ ఫామ్‌ను నాలుగు సంవత్సరాలు కష్టపడి పెంచితే తర్వాత సంవత్సరం నుంచి ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ పంటలకు వాడే డ్రిప్ ఇరిగేషన్‌కి సేల్స్ టాక్స్ ను రద్దు చేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. తమ శాఖ దగ్గర 30 లక్షల ఆయిల్ ఫామ్ మొక్కలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పుడున్న 1000 కోట్ల టర్నోవర్ ను సంవత్సర కాలంలో 2000 కోట్లకు చేరేందుకు కృషి చేస్తానన్నారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని తప్పకుండా చేస్తామన్నారు. ప్రతి జిల్లాలో మండలంలో ఆయిల్ ఫామ్ పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహించి రైతులను చైతన్యపరిచి ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు కృషి చేస్తామని తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం అవగాహన సదస్సులు

హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గం నిర్ణయం

నవతెలంగాణ-నయీంనగర్



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి డ్రగ్స్ రహిత సమాజం కోసం రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రతి పాఠశాల, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఆదివారం జరిగిన హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, పాలకవర్గం నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నేటి యువత భావితరాలకు ఆదర్శంగా నిలవాలంటే డ్రగ్స్ కు బానిస కాకుండా నవ యువ సమాజాన్ని నిర్మించాలని, దేశ భవిష్యత్తు యువత పైన, విద్యార్థిని, విద్యార్థుల పైన ఆధారపడి ఉందని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఈకీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం సీనియర్ వైద్యులు, రెడ్ క్రాస్ జిల్లా పాలకవర్గసభ్యులు డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి జన్మదినం పురస్కరించుకొని రెడ్ క్రాస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈవీ శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరు వేణు గోపాల్, డాక్టర్ మాగంటి శేషు మాధవ్, డా.సుధాకర్ రెడ్డి, డాక్టర్ సంధ్యారాణి, చెన్నమనేని, జెర్సీ, చెన్నమనేని జయశ్రీలు పాల్గొన్నారు.

నేడు 'కుమారస్వామి కామరాజర్' జయంతి..

డీఎంకే పార్టీ తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇన్‌చార్జి శివాజీ నాగరాజ్

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి



నిర్బంధ ఉచిత విద్య, మధ్యాహ్న భోజన పథక నిర్మాత, కింగ్ మేకర్, పెరుంతలైవర్, భారతరత్న కుమారస్వామి కామరాజర్ జయంతిని నేడు నిర్వహిస్తున్నట్టు డీఎంకే పార్టీ తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇన్‌చార్జి శివాజీ నాగరాజ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. కుమారస్వామి కామరాజ్ జులై 15, 1903న తమిళనాడులోని వెనుకబడిన ప్రాంతంలోని పేద కుటుంబంలో జన్మించాడని జలియన్‌వాలాబాగ్ మారణకాండ అతని జీవితాన్ని మార్చివేసిందని అన్నారు. 1937, 1946లో మద్రాసు శాసనసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. 1946లో భారత రాజ్యాంగ సభకు, తర్వాత 1952లో పార్లమెంటుకు కూడా ఎన్నికయ్యాడన్నారు. 1954లో మద్రాసు ముఖ్యమంత్రి అయ్యాడన్నారు. 1954 ఏప్రిల్ 13న మద్రాస్ ప్రావిన్స్‌కు ముఖ్యమంత్రి కాగా కుటుంబ వత్తి ఆధారిత వారసత్వ విద్యావిధానాన్ని తొలగించి విద్య, వాణిజ్యాల్లో మద్రాస్ ప్రావిన్స్‌ను అగ్రగామిగా మార్చారన్నారు. ఆయన కాలంలో భారీ నీటిపారుదల పథకాల్ని రూపొందించారని, కుమారస్వామి కామరాజ్ తుది శ్వాసవరకు ప్రజలకోసమే శ్రమించారని అన్నారు. 1976లో ఆయన సేవలు గుర్తించి భారతరత్నతో సత్కరించారని గుర్తు చేశారు. అనంతరం తమిళనాడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకె పార్టీ ముఖ్యమంత్రి కలయింజ్ఞర్ కరుణానిధి 2006 జులై 15 కామరాజ్ జయంతిని విద్యాభివద్ధి దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారన్నారు. ప్రస్తుత డిఎంకె పార్టీ ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ కూడా ఆయన స్ఫూర్తితోనే పాలన అందిస్తున్నారని చెప్పారు.

కేయూ ల్యాండ్స్ సర్వే పనులు ప్రారంభం..

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా



కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జ్ వాకాటి కరుణ ఆదేశాల మేరకు కాకతీయ విశ్వవిద్యాలయ అధికారులు కాంపౌండ్ వాల్ కాకతీయ విశ్వవిద్యాలయ ల్యాండ్స్ సర్వే పనిని మొదలుపెట్టారు. ఇందులో భాగంగా రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆచార్య ఎస్.వాసుదేవరెడ్డి, బిల్డింగ్ డివిజన్ సిబ్బందితో జిల్లా అధికారులు ఆర్డిఓ, ఎమ్మార్వో తో శనివారం సమావేశమయ్యారు. ఆదివారం ఉదయం క్యాంపస్ పరిసరాల్లోని కుమార్ పల్లి, గుండ్ల సింగారం, ఇంజనీరింగ్ కళాశాల ప్రాంతంలో సర్వేను పూర్తి చేశారు. కాంపౌండ్ వాల్, సర్వే పనులు సమర్థవంతంగా చేయటానికి, ఇబ్బందులు లేకుండా పూర్తి చేయటానికి వైస్ ఛాన్సలర్, ఇన్‌ఛార్జ్ కరుణ వాకాటి కరుణ ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో సోషల్ సైన్సెస్ డీన్ ఆచార్య టీ. మనోహర్, బిల్డింగ్ డిజైన్ పూర్వ అభివద్ధి అధికారి, ఆచార్య వి.రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య బి.సురేష్ లాల్, లీగల్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.శ్రీనివాస్ అభివద్ధి అధికారి ఆచార్య వాసుదేవ రెడ్డి, యూనివర్సిటీ ఇంజనీర్ పి.రామయ్య, బిల్డింగ్ డివిజన్ సూపర్ ఇంటెండెంట్ ఎం.సునీల్, కుమార్ కన్వీనర్‌గా కమిటీ నియామకం జరిగిందని ఆచార్య మల్లారెడ్డి వెల్లడించారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలి

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ధర్మసాగర్

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్ కులస్తుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లతో ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని, బీసీ-డీ నుండి బీసీ-ఏ లోనికి మార్చాలని జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పిట్టల సత్యనారాయణ ఆధ్వర్యంలో ధర్మసాగర్ మండల కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మైనిఫెస్టోలో పొందుపరిచినట్లుగా అభయహస్తం లో ముదిరాజ్‌లకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుండి 20 తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్వోలకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేస్తే ముదిరాజ్‌లకు ఉపయోగకరంగా ఉంటుందని కోరారు. చెరువులు కుంటల పై ముదిరాజ్‌లకు సంపూర్ణ హక్కులు కేటాయించాలన్నారు. త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ పిట్టలసత్యనారాయణ, మాజీ సర్పంచ్ మహేందర్, రమేష్ మత్స్య శాఖ కార్మికులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన వారిలో మరొకరు మృతి

నలుగురికి చేరిన మతుల సంఖ్య

వాజేడులో విషాదఛాయలు

నవతెలంగాణ-ఏటూరునాగారం (ఐటీడీఏ)

ఏటూరునాగారం జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య ఆదివారం నాటికి నలుగురికి చేరింది. ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రానికి చెందిన కాకర్లపూడి సత్యనారాయణ భార్య సత్యవతి తన కూతుర్ని తుని బస్సు ఎక్కించడానికి ఏటూరునాగారం బస్టాండ్‌కు ఆటోలో వస్తున్న క్రమంలో కంటైనర్ ఢీ కొట్టి ఆటో డ్రైవర్‌తో సహా ముగ్గురు అక్కడికక్కడే మతి చెందిన సంఘటన తెలిసిందే. అయితే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనితను స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అనిత కూడా ఆదివారం మృతి చెందింది. అనితకు వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతి చెందిన సత్యనారాయణ సత్యవతిలకు అనిత ఒక్కతే కుమార్తె కావడంతో వారి కుటుంబం మొత్తం రోడ్డు ప్రమాదంలో బలైపోయింది. అనిత మతితో మతుల సంఖ్య నలుగురికి చేరడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



రియాజ్‌కు అభినందనలు తెలిపిన పుల్లూరు వేణు గోపాల్

నవతెలంగాణ-సుబేదారి

రియాజ్ కు పుల్లూరు వేణు గోపాల్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషద్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ రియాజ్‌ను హైదరాబాద్ లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీ కార్యాలయంలో పదవి భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సభ్యులు, టీఎన్ జీ ఓస్ యూనియన్ నాయకులు పుల్లూరు వేణు గోపాల్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావేత్త, ఎంతోమంది విద్యార్థుల జీవితాలను మార్గ నిర్దేశనం చేసిన రియాజ్ నాయకత్వంలో లైబ్రరీలు విద్యార్థులకు, నిరుద్యోగులకు, ఉద్యోగార్థులకు అందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దబడతాయని నమ్మకం ఉందని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో.. రైతు భరోసా పై వర్క్ షాప్..

నవతెలంగాణ-సుబేదారి

రైతు భరోసా పథకం విధి విధానాలపై నేడు(సోమవారం) ఉదయం 10.30 గంటలకు హన్మకొండ సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం, ఐడీవోసీలో వర్క్ షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ హోదాలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో పాటు రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సితక్కలు పాల్గొంటారు. రైతు భరోసా విధివిధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను సేకరిస్తారు.

సాజిదా బేగంకు డాక్టరేట్ ప్రధానం..



నవతెలంగాణ-ఆత్మకూరు

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఎండీ. సాజిదాబేగంకు ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్, రిసెర్చ్ యూనివర్సిటీ వారు ఆదివారం హైదరాబాద్‌లోజరిగిన యూనివర్సిటీ కార్యక్రమంలో గౌరవ డాక్టర్‌రేట్ ప్రధానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సాజిదా బేగం చేస్తున్న రక్తదాన కార్యక్రమానికి, వివిధ సందర్భాల్లో చేసిన సామాజిక సేవలకు గాను, కరోనా కష్టకాలంలో అందించిన సేవలకు గుర్తించి డాక్టరేట్ అవార్డు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సాజిదా బేగం మాట్లాడుతూ తాను చేసిన సేవలకు గుర్తించి నాకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిన యూనివర్సిటీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈఅవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఇకపై రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తానని తెలిపారు.

ప్రమాదమని తెలిసినా..

ధాన్యం లారీపైన హమాలీల ప్రయాణం..



నవతెలంగాణ-శాయంపేట.

రైస్ మిల్లులకు తరలించడానికి లారీలలో ధాన్యం లోడు చేసిన హమాలీలు ప్రయాణం ప్రమాదమని తెలిసినా లారీ క్యాబిన్ పై కూర్చుని ప్రయాణిస్తుండడం ఆదివారం 'నవతెలంగాణ' కెమెరా క్లిక్ మనిపించింది. గ్రామాలలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని మండలంలోని ఆరేపల్లి గ్రామంలోని ప్రభుత్వ గోదాములలో నిలువ చేసి, ఆ ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లు యజమానులు బీహార్ నుండి వచ్చిన హమాలీలను లారీలలో తీసుకుని వచ్చి ధాన్యం లోడింగ్ అయ్యాక హమాలీలను క్యాబిన్ లోపల, క్యాబిన్ పైన కూర్చోపెట్టుకొని తీసుకొని వెళ్తున్నారు. విద్యుత్ తీగలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. స్థానిక హమాలీలు అందుబాటులో ఉన్నప్పటికీ బీహార్ నుండి వచ్చిన హమాలీలతోనే పనులు చేయించుకుంటున్నారని, తమకు పని కల్పించాలని ఏఐటీయూసీ మండల ప్రధాన కార్యదర్శి భోగి రమేష్ కోరారు.

శాయంపేటలో పీర్ల పండుగ ఉత్సవాలు

నవతెలంగాణ-శాయంపేట

శాయంపేట గ్రామంలో పీర్ల పండగ ఉత్సవాలను ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలోని గాంధీ చౌక్ ప్రాంతంలో నిర్వాహకులు షఫీ పీరీలకు ప్రత్యేక పూజలు చేసి డప్పు చప్పుల నడుమ ఊరేగించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. విభూది బొట్టు పెట్టి నిర్వాహకులు ఆశీర్వదించారు. గ్రామంలో కులమాతాలకతీతంగా పీర్ల పండుగ ఉత్సవాలను నిర్వహించుకున్నారు.

ద్విచక్రవాహనం కారు ఢీ.. దంపతులకు గాయాలు

నవతెలంగాణ -ఆత్మకూరు

మండలంలోని నీరు కుళ్ళ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే నీరు కుళ్ళ గ్రామానికి చెందిన మామిడి గణపతి-రజితలు నీరుకుళ్ల క్రాస్ నుండి పరకాలకు పని నిమిత్తం శనివారం ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో పత్తిపాక క్రాస్ వద్ద అతి వేగంగా వరంగల్ నుండి వస్తున్న హోండా కారు గణపతి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టగా గణపతి దంపతులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. గణపతి బావమరిది దామెర రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కూడా చైర్మన్ కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ -హనుమకొండ చౌరస్తా

కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కూడాచెర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం హనంకొండలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, ఓసి జేఏసీ రాష్ట్రఅధ్యక్షులు పాడి గణపతి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ మాజీ కార్యదర్శి నరగని కుమార్ గౌడ్, మాజీ ఎంపీటీసీ రేణికుంట అశోక్, ఎర్రగడ్డ దేవస్థానం డైరెక్టర్ కనపర్తి రాజు, పత్తిపాక అరుణ్, బారుపాటి సత్యం, ప్రకాష్ జన్ను అశోక్, తదితరులు పాల్గొన్నారు.



జవహర్ కాలనీ బ్రిడ్జి తాత్కాలికంగా ప్రారంభం

నవతెలంగాణ-నయీంనగర్

గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధి 56 డివిజన్‌లో గల జవహర్ కాలనీ కి వెళ్లే మార్గంలో బ్రిడ్జి పోయిన సంవత్సరం వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. ఇట్టి బ్రిడ్జిని తిరిగి పునర్నిర్మించారు. ఇప్పుడు ఈ బ్రిడ్జి మీద నుండి వాహనాలు తాత్కాలికంగా నడుస్తున్నాయి. ఇట్టి సందర్భంలో వెంకటేశ్వర కాలనీ 5/ఏ కాలనీవాసులు బ్రిడ్జి దగ్గర గల మైసమ్మ గుడిలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో 56 డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్, కాలనీవాసులు గిరెడ్డి అనిల్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి నరసింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సర్వేశం పాల్గొన్నారు.

పోచమ్మకుంట పీహెచ్‌సీపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



హనంకొండలోని పోచమ్మ కుంట చెందిన డి.తిరుపతి అనే వ్యక్తి పోచమ్మ కుంట పీహెచ్‌సీలో లోకి వెళ్లి జ్వరము, జలుబు ఉందని వైద్యులకు కు చెప్పగా వారు పారాసిటమాల్‌తో పాటు సిటిజన్ టాబ్లెట్స్ ఇవ్వడం జరిగింది. ఆ టాబ్లెట్స్ సాయంత్రం వేసుకొని చూడ అది పూర్తిగా పిండిలాగా వస్తుంది. కావున నాణ్యతలేని టాబ్లెట్స్ ను సప్లై చేస్తూ ప్రజల అనారోగ్యానికి కారణం అవుతున్న పోచమ్మకుంట పీహెచ్‌సీపై హనుమకొండ డీఎంహెచ్‌వో తక్షణమే స్పందించి దానిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.



పూర్వ విద్యార్థుల అనుభవాలే నేటి తరానికి మార్గదర్శకాలు

టీజీఆర్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-హసన్‌పర్తి

గురుకుల విద్యావిధానంలో పూర్వ విద్యార్థుల అనుభవాలే నేటి తరానికి మార్గదర్శకాలని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల విద్యాలయం ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్ తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో 1992-93 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ పూర్వ అపూర్వ జ్ఞాపకాలను పంచుకొని సంబరంగా గడిపారు. అనంతరం పూర్వ విద్యార్థినీ అరుణ కీర్తి పతాక తన కవితతో సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అశోక్ రెడ్డి మాట్లాడుతూ గురుకులంలో చదువుకున్న, చదువును కొనసాగిస్తున్న విద్యార్థులు తమ జీవితంలో గొప్పగా రాణించి తాము చదువుకున్న విద్యాలయ అభివృద్ధికి పాటుపడేలా ఎదిగినప్పుడే గురువులకు, తల్లిదండ్రులకు గౌరవంగా ఉంటుందన్నారు. గత పూర్వ విద్యార్థులతో కలిసి ఈ పూర్వ విద్యార్థులు గురుకుల అవరణలో సరస్వతీ మాత విగ్రహం, హైమాక్స్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి తమ జ్ఞాపకార్థం సేవ చేయడం సంతోషదాయకమన్నారు. ఈకార్యక్రమంలో గురుకుల ఉపాధ్యాయులు విజయలక్ష్మి, తులసి, రేణుక, వినయ్ కుమార్, రాజకుమారి, అరుణ, శోభారాణి, కమలకుమారి, తిరుపతి, పూర్వ ఉపాధ్యాయులు సుమతి, సువర్ణ, అనితారెడ్డి, రాజేశ్వరి, రాజశ్రీ, శాంతకుమారి, సూర్యవర్ధిని, లూసీ, శ్రీదేవి, సరిత, మధునారెడ్డి, సుదాస్త్రీ, రమారాని, లక్ష్మిప్రసన్న, కృష్ణవేణి, పావని, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఎస్సై

నవతెలంగాణ-దామెర



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలం సమీపించడంతో దోమలు వృద్ధి చెంది అనేక రకాల వ్యాధులను ప్రభలింప చేస్తాయని ఎస్సై కొంక అశోక్ అన్నారు. ఆదివారము దామెర పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి వెళ్ళినప్పుడు రహదారికి ఇరువైపులా చెత్తాచెదారంతో పాటు గుంతలు పడి ఉండడంతో అది గమనించిన ఎస్సై స్థానికులను పిలిచి శుభ్రం చేసుకోవాలని చెప్పడంతో మాజీ సర్పంచ్ భర్త పున్నం సంపత్ జెసిబి సాయంతో గుంతలను పూడ్చి శుభ్రం చేయించారు. వారందరికీ ఎస్సై అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. వీరి వెంట స్థానికులు పాల్గొన్నారు.

రైతులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

నవతెలంగాణ-పర్వతగిరి

వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో రైతులపై దాడి చేసిన గుమస్తాలపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఆరుగాలం కష్టించి పంటలు పండిస్తూ దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతులను కంటిపాపలాగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దళారులు, వ్యాపారస్తులు, గుమస్తాలు కుమ్మక్కై రైతుల మీద దాడి చేసినప్పటికీ మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు.ఈ విషయంపై సోమవారం ప్రజావాణిలో వరంగల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం జులై 15, 2024 www.navatelangana.com

'పూజిత'కు ఎమ్మెల్యే సన్మానం



నవతెలంగాణ - భూపాలపల్లి టౌన్

భూపాలపల్లి పట్టణంలోని హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థిని చెరుకుపల్లి పూజిత ఇటీవల వెలువడిన సిఏ(చార్టెడ్ అకౌంటెంట్) ఫలితాలలో ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం రాత్రి సదరు విద్యార్థిని పూజితను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ.. మెడిటేషన్ ద్వారా అమోఘమైన శక్తిని పొంది, ఏకాగ్రతతో ఎలాంటి ఒత్తిడి లేకుండా మొదటి ప్రయత్నంలోనే సీఏ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం పలువురు విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యేను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కాగా, పూజిత తల్లిదండ్రులు చెరుకుపల్లి రవీందర్ - మాధవి దంపతులిద్దరూ హార్ట్ ఫుల్ మెడిటేషన్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్‌గా, ట్రిసిప్టర్‌గా పనిచేస్తుండటం విశేషం. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, నాయకులు సాంబమూర్తి, అప్పం కిషన్, రంజిత్, మహేందర్, తదితర కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

సింగరేణి ఓసీ-3 ఆధ్వర్యంలో వైద్య శిబిరం



నవతెలంగాణ-గణపురం

మండలంలోని నగరంపల్లి శివారు ఓసీ-3 ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామం కొండంపల్లి గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్ఓ టు జీఎం టి వెంకట్రామారెడ్డి హాజరై వైద్య శిబిరం ప్రారంభించారు. వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల వల్ల పరిసర ప్రభావిత గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం ఆదేశాల మేరకు ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ ఆదేశానుసారం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు భూపాలపల్లి ఏరియా ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ముందుగా వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పీఓ, కేటీకే ఓసీ-3 మెడికల్ సూపరింటెండెంట్ భిక్షమయ్య, డాక్టర్ హరిప్రసాద్, డాక్టర్ రాజేశ్వరరావు, ఎస్ఈ బాలరాజు, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీర తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుకు ఎల్ఓసీ అందజేత

నవతెలంగాణ-మల్హర్‌రావు/మహాదేవపూర్

మంథని నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద బాధిత కుటుంబాలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పలువురికి అండగా నిలుస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎల్ఓసిలు ఇప్పిస్తూ పేదలకు భరోసా కల్పిస్తున్నారు. ఈ క్రమంలో కాటారం మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కందుల శివ గోవిందమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం ఆయన కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే దుద్దిళ్ల స్పందించి వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2.50లక్షల ఎల్ఓసీని మంజూరు చేయించి మంత్రి ఆస్పత్రి సహాయకుడి ద్వారా హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఇందుకు బాధితురాలి కుటుంబం మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

'కోటి తలంబ్రాలు' వడ్ల పూజ



నవతెలంగాణ-గణపురం

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో 2025లో జరుగబోయే శ్రీ సీతా రాముల కళ్యాణోత్సవానికి కోటి తలంబ్రాల కోసం ఆదివారం వడ్ల పూజ చేశారు. మండల పరిధి చెల్పూర్ గ్రామానికి చెందిన రామదాసు తిరుపతి-తిరుపతమ్మ దంపతులు చెల్పూర్ నుండి నారు పోసే వడ్లు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. ఆ వడ్లను చెల్పూర్‌కు తీసుకొచ్చి పంట పొలంలో నాటు వేస్తారు. అనంతరం ఆ పొలంలో పండిన ధాన్యాన్ని భద్రాచలం శ్రీరామునికి కోటి తలంబ్రాలు గోటితో తీసి భద్రాచలం పంపించనున్నట్లు తిరుపతి దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి ఏఈఓ సాయిబాబా రామకృష్ణ ప్రసాద్, అనిల్, ప్రభాకర్ జ్యోతి, లక్ష్మి, రవి, హనుమంతురావు, చందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రేడ్ కార్పొరేషన్ చైర్మెన్ ప్రకాష్‌రెడ్డికి సన్మానం



నవతెలంగాణ-మల్హర్‌రావు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆశీస్సులతో ఇటీవల తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మెన్‌గా అయిత ప్రకాష్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన విషయం విధితమే. ఆదివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆయనను ఆన్‌సాన్‌పల్లి తాజా మాజీ సర్పంచ్ గుగులోత్ జగన్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు కుడుములు శ్రీనివాస్, కాసర్ల రాజయ్య, శ్రీనివాస్, ఆకునూరి రవిందర్, దూలం రాజు,బోయిని రాంబాబు, తాడిచెర్ల గ్రామానికి చెందిన బిర్నేని దుర్గాప్రసాద్, గుగ్గిళ్ల రాజ్ కుమార్, రవి, తాండ్ర సది, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

నవతెలంగాణ-గణపురం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జేఏసీ జిల్లా కోఆర్డినేటర్ బోనాల రాజమౌళి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. నేడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 33 సంఘాలతో కలిసి జేఏసీ ఏర్పాటు చేశామని, తెలంగాణలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు సాధన కోసం రాష్ట్రంలోని పెన్షనర్ల సంఘాలను ఏకతాటి చేశామన్నారు. దశలవారీగా పోరాటం చేస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు.. ఆహ్వానించిన మంత్రి శ్రీధర్‌బాబు



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండలంలోని ఎడ్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బత్తుల తిరుపతితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితేల రాజయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆదివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందేలా ప్రతి కార్యకర్త చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ రాష్ట్ర కార్యదర్శి జంగిడి శ్రీనివాస్, ఎడ్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు జంగిడి సమ్మయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి,నాయకులు బాలాజీ,రాజేందర్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా రైతు వేదికలు !

నవతెలంగాణ-భూపాలపల్లి

అన్నదాతకు పంటల మెలకువల పట్ల అవగాహన కల్పించేందుకు గత ప్రభుత్వం రైతు వేదికలను అట్టహాసంగా ఏర్పాటు చేసింది. కానీ, నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. నిధులు కూడా నిలిపివేయడంతో వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో అసాంఘిక శక్తులకు అడ్డాలుగా మారాయి. దాదాపు రెండేండ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో ఏం చేయాలో తెలియక పాట్లు పడుతున్నామని సంబంధిత అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అయినా వీటిని పట్టించుకుంటుందని రైతులు భావించినా ఫలితం లేకుండా పోతోంది. ఇందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని రైతు వేదికలే నిదర్శనం

భూపాలపల్లి జిల్లాలో ప్రతి 5వేల ఎకరాలకు ఒక క్లసర్ చొప్పున 12 మండలాల్లో మొత్తం 45 రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.22 లక్షలు ఖర్చు చేసింది. ఈ మొత్తంలో రూ.10లక్షలు ఉపాధి హామీ నిధుల కింద సమకూర్చగా, మిగతా రూ.12లక్షలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రైతు వేదికలలో ఏఈవో, రైతు వేదిక కోఆర్డినేటర్లకు ఒక్కొక్కటి చొప్పున చాంబర్, 200మంది రైతులు కూర్చునేందుకు వీలుగా సమావేశ మందిరం, రిసెప్షన్, రెండు మరుగుదొడ్లు నిర్మించేలా డిజైన్ చేశారు. ఒక్కో వేదిక కోసం కనీసం అర ఎకరం, భూమి లభ్యత ఉన్న చోట ఎకరం ప్రభుత్వం కేటాయించింది. రైతు వేదికల ప్రారంభ సమయంలో ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున విడుదల చేయడంతో నిర్వహణ సవ్యంగా సాగింది. ఇచ్చిన రూ.9వేలల్లో పరిశుభ్రతకు రూ.3వేలు, శిక్షణ ఖర్చుల కింద రూ.2,500, స్టేషనరీకి రూ.1000, విద్యుత్‌చార్జీల కోసం రూ.1000, మరమ్మతులకు రూ.1000, తాగునీటికి రూ.500 ఖర్చు చేసేవారు. గతంలో వేదికలను శుభ్రం చేసేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన వారు సైతం వేతనాలు ఇవ్వకపోవడంతో పనులకు రావట్లేదు. పలుచోట్ల ఏఈవోలే కొంత మొత్తాన్ని భరిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నెలకు రెండుసార్లు పంచాయతీ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. నిర్వహణకు నిధులు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో వినియోగంలో లేవు. పలుచోట్ల మరికొన్ని చోట్ల మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేదన్న సాకుతో వాటిని నిరుపయోగంగా ఉంచుతున్నారు.

రెండేండ్లుగా నిరుపయోగం

కొన్నిటిపైనే దృష్టి సారించిన కొత్త ప్రభుత్వం



అసాంఘిక శక్తులకు అడ్డా..

రైతు వేదికల వద్ద భద్రత లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. రాత్రివేళ కనీసం కాపలాదారులు లేక వాటి భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఇక్కడ సమావేశాల నిర్వహణ కోసం ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు. భద్రత లేకపోవడంతో ఎప్పుడేమి జరుగు తోందనని ఏఈవోలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి నెలా నిధులు కేటాయించడంతో పాటు వాచ్‌మెన్‌లను నియమించాలని, ప్రభుత్వం స్పందించి రైతు వేదికలను వినియోగంలోకి తేవాలని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

అవగాహన సేవలేవీ ?

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మొదట్లో కొన్ని రైతు వేదికలను ఎంపిక చేసి దృశ్య, శ్రవణ కేంద్రాలుగా మార్చాలని, నియోజకవర్గానికి ఒకటి చొప్పున వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులో భూపాలపల్లితో పాటు, మంథని నియోజకవర్గంలోని కాటారం మండలాన్ని ఎంపిక చేశారు. మిగతావాటి పరిస్థితి ఏమిటన్నదానిపై స్పష్టత లేదు. అలాగే రైతు నేస్తం ద్వారా వ్యవసాయంలో విస్తరణ కార్యకలాపాలను బలోపేతం చేయడంలేదు.

భూముల ధరలకు రెక్కలు !

- మారుతున్న మార్కెట్ విలువ
- ధరలు పెంచేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- రంగం సిద్ధం చేస్తున్న రిజిస్ట్రేషన్ అధికారులు
- ఆందోళనలో సామాన్యులు



నవతెలంగాణ-మల్హర్‌రావు

మండల కేంద్రమైన తాడిచెర్ల ఓసీపీకి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి ఇటీవల ఎకరం వ్యవసాయ భూమి రూ.కోటి, పెద్దతూండ్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన మరో వ్యక్తి ఎకరం వ్యవసాయ భూమిని రూ.40 లక్షలు, మల్లారం వెళ్లే ప్రధాన రహదారి పక్కన మరో వ్యక్తి ఎకరం భూమి రూ.30 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ ఖర్చులు ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.20వేల వరకు అయింది. మార్కెట్ విలువ పెరిగితే రిజిస్ట్రేషన్ భారం పెరిగే అవకాశం ఉంది. ఎకరం భూమిని రిజిస్ట్రేషన్ చేయించు కోవాలంటే కనీసం రూ.30వేల నుంచి రూ.40వేల వరకు ఖర్చు య్యే అవకాశం ఉంది.మండల కేంద్రమైన తాడిచెర్లతోపాటు వివిధ గ్రామాల్లో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎక్కువగా వ్యాపారులు, సింగరేణి కార్మికులు భూములు కొను గోలు చేస్తున్న నేపథ్యంలో భూముల ధరలు పట్టణాలకు పోటీ పడుతున్న పరి స్థితి. రాష్ట్రవ్యాప్తంగా భూముల విలువ పెంచాలన్న కసరత్తు సాగుతున్నట్లుగా తెలుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఏడు నెలల వ్యవధిలోనే రెండు సార్లు పెంచారు. కొత్త ప్రభుత్వం సైతం మార్కెట్ విలువలు పెంచాలని యోచి స్తున్నట్లుగా సమాచారం. ఈ మేరకు రిజిస్ట్రేషన్ అధికారులు ప్రభుత్వ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదే పనిలో నిమగ్నమయ్యారు.

ఏడు నెలల్లో రెండు సార్లు.....

గత ప్రభుత్వ హయాంలో 2021 జులై 22 వరకు మార్కెట్ ధరల్లో 20 నుంచి 50 శాతం వరకు పెరిగింది.తరువాత ఏడూ నెలల వ్యవధిలోనే 01ఫిబ్రవరి, 2022న పెంచిన విలువపై మరో 20 నుంచి 50 శాతం వరకు మార్కెట్ విలువ పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. తక్కువ వ్యవధిలోనే రెండు సార్లు పెంచడంతో ప్రజలపై పెనుభారం పడింది. అప్పుడు ఓపెన్ ప్లాట్స్ 30 శాతం, వ్యవసాయ భూములకు 50శాతం వరకు పెంచారు. ప్రస్తుతం ప్రభుత్వం కూడా మార్కెట్ విలువను పెంచాలనే ఆలోచనలో ఉండడంతో రిజిస్ట్రేషన్ అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయ భూములు 30 శాతం నుంచి 50శాతం వరకు, ఓపెన్ ప్లాట్స్ 30శాతం వరకు పెరగొచ్చని అంచనా వేస్తున్నారు.

ఆందోళనలో సామాన్యులు.....

ప్రభుత్వం మార్కెట్ విలువ పెంచాలని నిర్ణయించడంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు.చాలామంది త్వరగా రిజిస్ట్రేషన్లే చేయించుకుంటున్నారు. కుటుంబ సభ్యులు సైతం ఆస్తుల పంపకాలు, అమ్మకాలు,కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇప్పటికే అగ్రిమెంట్లు రాసుకున్నవారు సైతం కొనుగోలు చేసే పార్టీలు మార్కెట్ దరలు పెరిగితే రిజిస్ట్రేషన్ ధర కూడా పెరుగుతుందని గడువు కన్నా ముందుగానే చేసుకుంటున్నారు. మార్కెట్ విలువ పెంచాలనే ప్రభుత్వ నిర్ణయంతో మధ్య తరగతి ప్రజలు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలి

ప్రస్తుతం మార్కెట్ విలువ గతంలోనే రెండుసార్లు పెరిగింది.ఇప్పుడు మళ్లీ పెరుగుతాయంటున్నారు.మార్కెట్ ధరలు పెంచితే రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గించాలి.లేదంటే ప్రజలపై తీవ్రమైన భారం పడుతుంది.

\- డి సదయ్య, రియల్ ఎస్టేట్ వ్యాపారి

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్



నవతెలంగాణ-మహదేవపూర్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాదేవపూర్ మండల కేంద్రంలోని బీసీ బాయ్స్ హాస్టల్ ను ఆయన సందర్శించి మాట్లాడారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా సమస్యలన్నింటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు విన్నవించినా లాభం లేకుండా పోతోందన్నారు. బాత్రూమ్స్ డోర్స్ విరిగిపోయి ఉన్నాయని, విద్యుత్ సౌకర్యం లేదని ఆరోపించారు. అలాగే హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. తక్షణమే బీసీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే విద్యార్థులు అందరితో కలిసి హాస్టల్ ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు జాగరి హరీష్



నవతెలంగాణ-మల్హర్‌రావు

మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధుకర్‌పై కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు జాగరి హరీష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అక్రమాలపై తమ నాయకుడు ప్రశ్నిస్తే ఎదురు దాడులు చేయడం సరికాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అభివృద్ధి సంక్షేమం, నిరుద్యోగ సమస్య తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. కానీ, కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష నాయకులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బూడిద సదానందం, మండల ప్రధాన కార్యదర్శి నారమల్ల నవీన్, తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ పనులు పూర్తయ్యేనా ?




నవతెలంగాణ-మహాదేవపూర్

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ఈ సీజన్ కల్లా మేడిగడ్డ పనులు పూర్తయి సర్కారు లక్ష్యం నెరవేరుతుందా అంటే ఆ దిశగా పనులు సాగడం లేదని అర్థమవుతోంది. మేడిగడ్డ పిల్లర్లు కుంగడంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి బ్యారేజీ కోసం ప్రత్యేక నిధులు కేటాయించింది. ఇందుకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా ? నీటిని నిలువ చేసి ఎత్తిపోయాలనే సర్కారు ఆశయం నెరవేరుతుందా అంటే కాదనే వాదన వస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ వద్ద కుంగుబాటుకు గురైన పిల్లర్ల మరమ్మతులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పనులను పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పనులు ప్రారంభించారు బ్యారేజ్ వద్ద 16 చోట్ల పరీక్షలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 6 మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంతో ఈసారి మెడిగడ్డ పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికి ప్రాణహిత నుండి వరద నీరు వస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మరో బ్యారేజీ అన్నారం వద్ద నిర్దేశిత లక్ష్యాన్ని గుర్తించి ఇంజినీర్లు పనులను వేగవంతం చేసి పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో అన్నారంలో నీటి నిల్వ చేయడానికి అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగా అన్నారం బ్యారేజీ దిగువన ఇప్పటికే 33 చోట్ల పరీక్షలు పూర్తయ్యాయి. ఇసుక ఎంత మీరా ఉందన్న అంచనాల్లో భాగంగా 46 మీటర్ల వరకు ఉంటుందని 28 మీటర్ల లోతు వరకు డ్రైవింగ్ చేస్తూ శాంపిల్స్ కలెక్ట్ చేశారు. వీటిని నిపుణులు పరీక్షలు నిర్వహించి మరమ్మత్తులు చేయాలనే దిశగా ముందుకు సాగుతున్నారు. గ్రోటింగ్ పనులు నిర్వహించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బాగు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం లక్ష్యంతో పనులను నిర్వహించేలా నిధులు కేటాయించినా అందుకు అనుగుణంగా పనులు సాగకపోవడం ఇబ్బందికరంగా మారిందని, ఈ సంవత్సరం నీటి నిల్వ పంపిణీ జరగకపోవచ్చని పలువురు మండల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధుల కాలం... జర పైలం...

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



నవతెలంగాణ-మల్హర్‌రావు

వానాకాలం అపరిశుభ్రత కారణంగా గ్రామాల్లోని పలు వార్డుల్లో దోమలు, ఈగలు రాజ్యమేలుతాయి. వీటి వ్యాప్తితో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ రోగాలతో మంచం పడుతుంటారు. వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. మండ లంలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం అపరిశుభ్రంగా మారింది.డ్రైనేజీ పరిశుభ్రం చేయపోవడంతో మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు, ఈగలు రాజ్యమేలుతున్నాయి. వానాకాలంలో వర్షపు నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటుంది. నిల్వ నీటిలో దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయి. దోమల వల్ల టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వచ్చి కొందరు ఆస్పత్రుల పాలవుతున్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న పిచ్చి మొక్కలు, మురుగు కాల్వలు సైతం దోమలకు అవాసాలుగా మారుతున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

దోమలు వ్యాప్తి చెందకుండా ఖాళీ స్థలాల్లో నీరు నిల్వలు ఉంచకుండా చూసుకోవాలి. వారానికి ఒక రోజు డ్రైడే నిర్వహించాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. అనారోగ్యం బారిన పడిన వారిని వెంటనే ఆస్పత్రిలో చూపించాలి. అలాగే దోమలు వ్యాప్తి చెందకుండా మురుగు కాల్వలో నిల్వ గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బ్లీడింగ్ పౌడర్ చల్లాలి. క్లోరినేషన్ చేసిన నీటిని, కాచి చల్లార్చిన నీటినే తాగాలి. క్లోరినేషన్ మాత్రలను తాగునీటి బిందెల్లో వేసి తాగాలి. పరిసరాల్లో పిచ్చి మొక్కలు లేకుండా, చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వాడాలని, వేడి ఆహారం తీసుకోవాలని, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

'సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు'

నవతెలంగాణ-గణపురం

కల్లుగీత వృత్తిలో ప్రమాద నివారణకు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తిని శివశంకర్ గౌడ్ ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. కల్లుగీత వృత్తిలో సంవత్సరానికి 500మందికి పైగా చనిపోతున్నారని, కొందరు వికలాంగులు అవుతున్నారన్నారు. బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చొరవతో రూపొందించిన సేఫ్టీ మోకు డెమో ఇప్పించడం జరిగిందన్నారు. కల్లుగీత కార్మిక సంఘం చేసిన పలు సూచనలతో రూపుదిద్దుకొన్న సేఫ్టీ మోకులు లస్కర్‌గూడలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించి వాటిని పంపిణీ చేసినందుకు జిల్లా కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, టాడి కార్పొరేషన్ అధి కారులకు ధన్యవాదాలు తెలిపారు. వీటిని రాష్ట్రంలోని గీత కార్మికులం దరికీ ఉచితంగా ఇవ్వాలని కోరారు. ఇప్పటికే తాటి చెట్టు మీద నుండి పడి చనిపోయిన వారి కుటుంబాలకు, వికలాంగులకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా వెంటనే ఇవ్వాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
జనగామ
సోమవారం జులై 15, 2024 www.navatelangana.com



గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణ భగవానుడే..

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

నవతెలంగాణ-లింగాలఘనపురం

జూలై 21 వ తేదీ, ఆషాఢ మాసం లో వచ్చే గురు పౌర్ణమి ని పురస్కరించుకుని ఆదివారం , మండలం లోని న్యాలపోగుల గ్రామంలో త్రైత సిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి, జనగామ, తొర్రూరు, చేర్యాల కమిటీల సభ్యుల వారి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిగింది. గురువు గుణాతీతుడు అలాగే రూపవర్జితుడు , గుణముల మలినం లేదు... అలాగే రూపంలేదు.. కాబట్టి గురు అన్నారు. గుంద్రము అను పదము నుండి పుట్టిన పదమే గురువు" అని చెప్పవచ్చు ఆది మద్యాంత రహితుడైన పరమాత్మ భూమి పై భగవంతుడు (శ్రీకష్ణుడు) గా జన్మిస్తే ఆయనను గురువు అని అంటాము... పూర్వము గురువు గుంద్రాయి లాంటి వాడు సామెత గా అనెడి వారు , ఆది అంతము లేని గుండ్రాయి కూడా మొదలు చివర అనేవి ఉండవు కాబట్టి అలా పోల్చారు... దేవుడే మనిషి జన్మిస్తే ఆయనను మాత్రమే గురువు అని అనాలి... ఆషాఢ మాసం లో చంద్రుడు గుండ్రం గా పెద్ద గా ఉండుట వలన గురు పౌర్ణమి గా నిర్ణయించి సాక్షాత్తు శ్రీ కష్ణుడు ని మాత్రమే జగద్గురువు గా భావించి గురు పూజ చెయ్యాలి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- భువనగిరి, జనగాం, చేర్యాల, తొర్రూర్ కమిటీ సభ్యులు దేవేంద్ర, పంచాంక్షారీ , శంకర్, లక్ష్మీనారాయణ, సాయిరాజ్, అశోక్, ఉపేందర్, లింగస్వామి, శివ రామ కష్ణ, మధుకర్, కోటి, అక్షయ్, శ్రీరామ్ తారక్,లత, లావణ్య, జయమ్మ, సుకన్య, తదితరులు భగవద్గీత ప్రచారంలో పాల్గొన్నారు.

పేద ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలి: సీపీఎం



నవతెలంగాణ-లింగాలఘనపురం

పేద ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం కాచం కృష్ణమూర్తి నగర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు.. ప్రజలకుమౌలిక సదుపాయాలు, నీళ్ల విద్యుత్, ప్రభుత్వం అందించాలని, ఈ వర్షాకాలంలో వారి ఇబ్బందులను గుర్తించి పరిష్కారం చేయాలనారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జనగామ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారం రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి, కాచం కృష్ణమూర్తి, నాయకులు కడారి శ్రీనివాస్, గుగ్గిళ్ళ సుధాకర్, నీల రమేష్ పాలమాకుల రవి, సందుల కలమ్మ, ఐలాపురం నరసమ్మ, మంతపురం జయ, కళ్లెం కనకమ్మ, నల్ల ఉమా, చెరుపెల్లి ఐలమ్మ , తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండీ. రియాజ్‌కు సన్మానం



నవతెలంగాణ-జనగామ

తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ ఎండీ.రియాజ్ ను జనగామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రాజమౌళి కలిసి శాలువాతో సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌గా నూతన పదవి బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వరంగల్ కు వచ్చిన ఎండీ.రియాజ్‌ను జనగామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈసందర్భంగా రియాజ్ కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జనగామ నాయకులు మోర్తాల ప్రభాకర్, జయ మల్లేష్ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రులను కలిసిన సంపత్

నవతెలంగాణ-లింగాలఘనపురం

కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సెవెల్లి సంపత్ జన్మదిన సందర్భంగా హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్‌ను , మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్‌రావులను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండ..

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ

నవతెలంగాణ-పాలకుర్తి

మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్ద తండా కే లో ఇటీవలే మృతి చెందిన బానోతు కిషన్, బానోతు ధ్వాలి, బానోతు సోమన్న కుటుంబ సభ్యులను ఆదివారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బైరు భార్గవ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు లావుడియా భాస్కర్ నాయక్ తో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే తండాలో మృతి చెందడం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ వెన్నంటి ఉంటుందని, ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి తో పాటు ఇన్‌ఛార్జ్ ఝాన్సీ రెడ్డిలు అండగా ఉంటారన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు బానోతు బాలు నాయక్, బానోతు రవి నాయక్, లావుడియా శ్రీను నాయక్, లావుడియా రవినాయక్, బానోతు నరేష్, రవి, గుగులోతు తిరుపతి, లావుడియా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలకు.. కిరాణా వర్తక సంఘం సభ్యులు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

జనగామ పట్టణ కిరాణా వర్తక సంఘం సభ్యులు ఆదివారం ఆషాఢ వనభోజనాలకు వెళ్లారు. దాదాపు 50 కుటుంబాల సభ్యులు పట్టణ సమీపంలోని ఓ రిసార్ట్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆడి పాడారు. ఈకార్యక్రమంలో కిరాణా వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు బుద్ధ రమేష్, అధ్యక్షులు కందుకూరి ప్రభాకర్, సభ్యులు పన్నీరు శ్రీనివాస్, కందుకూరి నాగరాజు, బెల్దే సృజన్, జొన్నల కష్ణమూర్తి, టి.చంద్రశేఖర్, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని గంగాపూర్ గ్రామంలో గుండోజు లక్ష్మి మృతిచెందగా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండడంతో విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్ రూ.5వేల ఆర్థిక సహాయాన్ని పార్టీ మండల నాయకులు బందారం క్రాంతి కుమార్ ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు విద్యానాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు ఉమాపతి, నరసింహులు, శ్రీహరి, గాల్ రెడ్డి, రాములు, సుదర్శన్, సాంబయ్య, మల్లయ్య, సత్తయ్య, భద్రయ్య పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌సీ జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా నాగయ్య, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్‌లు ఎన్నిక

నవతెలంగాణ-పాలకుర్తి రూరల్/పాలకుర్తి



జనగామ జిల్లా కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్‌సీ వీఎల్‌ఈ)ల కమిటీ గౌరవ అధ్యక్షులుగా మాసంపల్లి నాగయ్య, సహాయ కార్యదర్శిగా రాపోల్ లక్ష్మణ్‌లు ఎన్నిక అయ్యారు. ఆదివారం జనగామ జిల్లా కేంద్రంలోని కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా కార్యాలయంలో వీఎల్ ఈ ల సమావేశంలో జిల్లా కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో పాలకుర్తి మండలం నుండి ఎన్నుకోబడిన మాసంపల్లి నాగయ్య, రాపోలు లక్ష్మణ్ లు మాట్లాడుతూ జిల్లా కమిటీ తమకు ఇచ్చిన బాధ్యతలను సీఎస్‌ఈ వీ ఎల్‌ఈల సంక్షేమం కొరకు శక్తి వంచన లేకుండా కషి చేస్తామని వారు తెలిపారు.

నూతన కమిటీ ఏకగ్రీవం..



జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-జనగామ

జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జనగామ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జనగాం లోని గబ్బెట గోపాల్ రెడ్డి భవన్, సీపీఐ కార్యాలయం లో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఆల్ క్యాడర్స్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రామ రాజేష్ కన్నా సమక్షంలో సంఘం నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీ జిల్లా అధ్యక్షురాలుగా జ్యోతి, కార్యదర్శిగా గణేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పి. లిఖితరాణీ, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, కోశాధికారి మల్లేశం, జాయింట్ సెక్రెటరీగా తిరుచు రజిని, ఈసీ మెంబర్‌గా సీహెచ్.అంజయ్య, చీఫ్ అడ్వయిజర్ పి.సౌజన్య, ఈసీ మెంబర్ డాక్టర్ భార్గవి, ఈసీ మెంబర్ కొండ లత, ఈసీ మెంబర్‌గా అంజయ్య, లక్ష్మీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ 510 జీవోలో 4000 మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఈఅన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఈసమస్య పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగాగా పరిష్కరిస్తానని ఉద్యోగులకు ప్రభుత్వం చెప్పినట్లు తెలిపారు. జనగాం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి మాట్లాడుతూ 510 లో జీవోలో మాకు అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. వెంటనే దాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మాకు న్యాయం చేయాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డ్స్, మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనాలతో కూడిన సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని, కనీస వేతనాలు అమలు అయ్యేటట్టు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షులు కందిక చెన్నకేశవులు పాల్గొని మాట్లాడుతూ ఎంప్లాయిస్ పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆసంఘం నాయకులు సాంబయ్య, సీహెచ్ నిర్మల, సీహెచ్. రజిని, లిఖిత, డాక్టర్ భార్గవి, మరిపెల్లి కవిత, రజిని సౌజన్య , మల్లేశం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్మడ బజార్ పేరుతో మోసం.. నిందితుల అరెస్టు

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఐ



నవతెలంగాణ-పాలకుర్తి

అర్మడ బజార్ షాపింగ్ మార్ట్ పేరుతో మోసం చేసిన నిందితులను అరెస్టు చేశామని పాలకుర్తి సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుజరాత్ కు చెందిన పరుశురాం రజనీత్ భాయ్ పాల్ తో పటు మరో ఐదుగురు కలిసి 2022 లో అర్మడా బజార్ షాపింగ్ మార్ట్ ను స్థాపించారని తెలిపారు. ఫ్రాంచైంజి ఇప్పించి కొంతకాలం మార్ట్ లు నడిపిన తర్వాత దివాలా తీయడంతో పరుశురాం రజనీత్ భాయ్ పాల్ ఢిల్లీకి చెందిన భీమ్ సింగ్‌ను ప్రమోటరుగా నియమించి పాలకుర్తిలో మార్ట్ పెట్టేందుకు ముగ్గురు ఇన్వెస్టర్ల దగ్గర రూ.30 లక్షల వసూలు చేయించి మార్ట్ లు పెట్టకుండా పెట్టుబడులు పెట్టిన వ్యక్తులను మోసం చేశారని తెలిపారు. 2022లో పాలకుర్తికి చెందిన ముగ్గురు వ్యక్తుల దగ్గర ఆర్మడ బజార్ షాపింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చెప్పినట్టుగా మధ్యవర్తిగా ఉండి ఆర్మడ బజార్ ఫ్రాన్చైంజి కొరకు రూ.30 లక్షలు తీసుకొని చివరకు ఎలాంటి ఫ్రాంచైంజి పెట్టకుండా బాధితులని మోసం చేశారని వివరించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 17న మోసపోయిన బాధితుల ఫిర్యాదు మేరకు పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. వరంగల్ సిపి అంబర్ కిషోర్ జా, జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపి అంబటి నర్సయ్య ఆదేశాల మేరకు ఎస్సై యాకూబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఢిల్లీకి దర్యాప్తు కొరకు పోలీసు బృందాన్ని పంపామని తెలిపారు. పోలీసు బృందం ప్రధాన నిందితుడైన భీమ్ సింగ్ ను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్ కు పంపామన్నారు. కేసు దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన సిఐ మహేందర్ రెడ్డి, ఎస్సై యాకుబ్ హుస్సేన్ ,కానిస్టేబుల్స్ నరేష్, శివ,రాజకుమార్, సోమేశ్వర్, శ్రావణ్ లను జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్,వర్ధన్నపేట ఏసిపి నర్సయ్య లు అభినందించారు. సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మోసాలకు మోసపోకూడదని, మోసం చేసేందుకు ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం..లింగారెడ్డి, కానిస్టేబుల్ భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామానికి సేవ చేయాలనే తపన నాది..

మాజీ వైస్ ఎంపీపీ చల్లా చందర్ రెడ్డి

నవతెలంగాణ-స్టేషన్‌ఘన్‌పూర్

గ్రామానికి సేవ చేయాలనే తపన తనదని, ఒకే కుటుంబంలో తాను ఎంపీపీగా, వారి సతీమణి ఉమాసుధీర్ రెడ్డి ఒకేసారి ఇద్దరం ఏకకాలంలో ప్రజాప్రతినిధులుగా ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందామని, ప్రజలకు సేవ చేయడమే భావంగా ప్రజాసహకారంతో పాలన సాగించినట్లు తాజా మాజీ వైఎస్ఎంపీపీ చల్లా చందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాటికొండ గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, సర్పంచ్ దంపతులను గ్రామ, మండలానికి చేసిన పలువురు శాలువాతో సత్కరించి, వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం గ్రామంలో వివిధ కారణాల చేత, గ్రామంలో వివిధ వార్డుల్లో బాధితులను వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి పరామర్శించి, రూ. 5వేల చొప్పున ఆదివారం ఆర్థిక సాయం చేశారు. గ్రామంలో ఇటీవల మరణించిన సిరిగిరి వెంకటయ్య, నారబోయిన బాలమ్మ బాధిత కుటుంబాలకు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముంత కొమురయ్యకు, అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ పాత్రికేయుడు నారబోయిన గోపాల్, స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని మామిడి కళ్యాణి, పదవ తరగతిలో మండల్ టాపర్‌గా నిలిచి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించగా ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందించారు. తమ పదవీ కాలంలో



సహకరించిన ప్రజలు, అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, మాజీ వార్డు సభ్యులు బర్మ రాజయ్య ఉమ్మగోని రాజు, ఎడమ రమేష్, స్థానికులు తాటికొండ రమేష్, మారపాక శ్రీనివాస్, మారపాక యాదగిరి, నారదాసు కుమార్, గాజుల రాములు, తాటికొండ సంపత్ కుమార్, కోరుకొప్పుల మహేందర్, మహమ్మద్ సాజిద్, నారబోయిన శ్రీనివాస్, పాలకుర్తి నాగరాజు, తాడురి సునీల్, పులి రవి, దామెర శ్రీనివాస్, చాగంటి అజయ్, మేకల అనిల్, అక్కనపల్లి సాంబరాజు, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సీఐటీయూ నాయకుల ఆర్థికసాయం

నవతెలంగాణ-దేవరుప్పుల

మండలంలోని మాధాపురం గ్రామ పంచాయతీ సిబ్బంది కొంగరి ఉప్పలయ్య గత వారం రోజుల క్రితం మరణించగా ఆదివారం మండల సీఐటీయూ అధ్వ ర్యంలో వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. ఐదు వేలను ఆర్థిక సాయంగా అందజేసి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయు మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రు, జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, మండల కోశాధికారి ఎడవల్లి వెంకటరెడ్డి, తోటి సిబ్బంది చింత రామ చందర్,అశోక్, ఉప్పుల ఐలయ్య, ఉప్ప లయ్య, రాములు, ఉప్పలయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం

నవతెలంగాణ-లింగాలఘనపురం

మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతి థులుగా విద్యాబోధనలు చేసిన నెల్లుట్ల రవీందర్‌రావు, రెహ మాన్, వరూధిని, లీలా వతిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నెల్లూట్ల రవీందర్ రావు మాట్లాడుతూ సమాజంలో ఉన్నత స్థితిని చేరుకున్నప్పుడు, మంచి స్థితి మంతులుగా ఉన్నతంగా ఉన్నప్పుడు ఉపాధ్యాయులకు అదే వారికి ఆనందాన్ని ఇస్తుందని వారిని ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటారన్నారు. లీలావతి మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన తరువాత ఇదే పాఠశాలలో చెప్పి వారితో విడదీయారని అనుబంధాన్ని ఏర్పాటు చేసుకున్నారని మాకు తెలియజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోడిశాల శివరామకృష్ణ, అంబాల సుధాకర్, వేణు ఉమారాణి, కృష్ణవేణి, మంజుల, ప్రేమలత, సంధ్య, సుమలత పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి సుంకరి యాదగిరి సేవలు ఎనలేనివి



నవతెలంగాణ- జనగామ కలెక్టరేట్

జనగామ జిల్లా వ్యాప్తంగా మహిళల ఆర్థికాభివృద్ధికి, సంక్షేమానికి సుంకరి యాదగిరి చేసిన సేవలు శ్లాఘనీయమని రుద్రమదేవి వద్ధాశ్రమ అధ్యక్షులు తాళ్ల లక్ష్మణ్ కొనియాడారు. సుంకరి యాదగిరి 8వ వర్ధంతి సంస్మరణ సభ ఆదివారం షామీర్‌పేటలోని రుద్రమదేవి వద్ధాశ్రమంలో జరిగింది. ఈ కార్యక్రమానికి తాళ్ల లక్ష్మణ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రుద్రమదేవి మహిళా మ్యాక్స్ సొసైటీకి సుంకరి యాదగిరి అహర్నిశలు కష్టపడ్డారన్నారు. రుద్రమదేవి వద్ధాశ్రమ రూపశిల్పి యాదగిరి అని, వద్ధాశ్రమ నిర్మాణానికి యాదగిరి కషి ఎంతో ఉందని గుర్తు చేశారు. సుంకర్ యాదగిరి కుమారుడు, వద్ధాశ్రమ ఇంచార్జ్ సుంకరి దేవేందర్ మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీని వద్ధాశ్రమాన్ని విజయవంతంగా నడపడానికి కృషి చేస్తానన్నారు.ఈ సందర్భంగా ఆశ్రమంలో వద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వద్ధాశ్రమ కో-ఆర్డినేటర్ యాసిన్, రుద్రమదేవి మాక్స్ సొసైటీ సీఈఓ పోగుల కవిత, మ్యాక్స్ అధ్యక్షులు లలిత, హోం సహాయ కో-ఆర్డినేటర్ లక్ష్మీప్రసన్న, అకౌంటెంట్ అనూష, ఏఎన్ఎం మౌని, యోగా తెరపిస్టు మాధవి, వద్ధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలి

లయన్స్ గవర్నర్ వెంకట్ రెడ్డి

నవతెలంగాణ-జనగామ

ఆరోగ్య విషయంలో ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండడం అనివార్యమని లయన్స్ ఇంటర్నేషనల్ 320- ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ వెంకటరెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఆదివారం లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో సీనియర్ క్లబ్ అధ్యక్షుడు వై సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఉచిత మెగా వైద్య ఆరోగ్య పరీక్షా శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ మాట్లాడుతూ జనగామ ప్రాంత లయన్స్ క్లబ్ ల సేవా నిరతిని అభినందిస్తూ కొనియాడారు. పట్టణంలోని హైదరాబాదు రోడ్డుకు గల ఏకశిలా పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు ఎముకలు, కీళ్లు, కిడ్నీ, ఊపిరితిత్తులు, నరాలు, చిన్న పిల్లల వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, నేత్ర సంబంధిత వ్యాధులకు సంబంధించి ఆయా వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు 570 మందికి పరీక్షలు నిర్వహించి అవసరార్థులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ముందుగా ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ లు జనగామ, ఆబాద్, మిలీనియం, సూర్య బి.భాయిస్, కింగ్స్ ఐఎంఏ., రెడ్ క్రాస్ సొసైటీ ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర రెడ్డి పాల్గొనలేకపోయిన లయన్స్ క్లబ్ లను అభినందిస్తూ కార్యక్రమం విజయవంతం కావాలని సందేశం పంపారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న జనగామ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రిల అసోషియేషన్ అధ్యక్షులు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్ మాట్లాడుతూ శిబిరంలో పాల్గొని సేవలందించిన యువ వైద్యులను అభినందించారు. పూర్వ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత నిర్వహించిన శిబిరంలో పలు రకాల వైద్య నిపుణులు పాల్గొని సేవలందించడం, వారే స్వయంగా మందులు తేవడం



లయన్స్ క్లబ్ లకు స్ఫూర్తి అని, గతంలో కూడా ఐఎంఏ, రెడ్ క్రాస్ సంస్థలతో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. ఐఎంఏ జనగామ అధ్యక్షుడు డాక్టర్ ఏ.శ్రీనివాస్, కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండడం గురించి వివరించారు. ఈ శిబిరంలో పాల్గొని వైద్య సహకారం అందించిన వారిలో డాక్టర్లు కల్నల్ మాచర్ల బిక్షపతి, జె బాలాజీ, వి.కోటిరెడ్డి, డి. లింగమూర్తి, పి.నాగేశ్వర్‌రావు, కె.రంజిత్ కుమార్, యు.ప్రవీణ్ కుమార్, ప్రీతి దయాల్, డి.స్వప్న, యు. లక్ష్మి, సిహెచ్. కనకరాజు, రంగు కార్తీక్, పి. కృష్ణచైతన్య, ఏ.శివకుమార్, డి.శివశంకర్, సంతోషి నేరెళ్ళ, చందా కావ్యలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ లు చందుపట్ల రవీందర్ రెడ్డి, కలువల భాస్కర్ రెడ్డి, శిబిరం కోఆర్డినేటర్ లు కదిరే రాజశేఖర్ రెడ్డి, కృష్ణ జీవన్ బజాజ్, శ్రీరామ్ శ్రీనివాస్, పబ్బా చంద్రశేఖర్, జోన్ చైర్మన్ లు పజ్జూరు జయహరి, శ్రీభాష్యం రఘు తదితరులు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్బుల అధ్యక్షులు సంజీవరెడ్డి, డా. పి.నాగేశ్వరరావు, గాదే నర్సింలు, నల్ల యాదగిరి, డా. డి. శివ శంకరరావు, కె రంజిత్ కుమార్, ఏకశిల పబ్లిక్ స్కూల్ ఏ ఓ. రామకష్ణ శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత లయన్ అల్లాడి ప్రభాకర్ రావు పతాక వందనం పటించారు. శిబిరం ఇన్‌ఛార్జ్ డాక్టర్ రంజిత్ కుమార్ స్వాగతం తెలుపగా చివరన నల్ల యాదగిరి వందన సమర్పణ చేశారు.

అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

నవతెలంగాణ-పాలకుర్తి

నిరుపేదల కుటుంబానికి అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందిస్తుందని ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన కోలా శ్రీను ఇటీవలే మృతి చెందడంతో పాలకుర్తి గ్రామానికి చెందిన బండి కిరణ్ కుమార్ సహకారంతో 25 కిలోల బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులను అందజేశామని శ్రీకాంత్ తెలిపారు. మృతుడి కుటుంబానికి చేయూనందించిన అమ్మ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులకు గ్రామస్తులు, మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని కొన్నె గ్రామంలో ద్యాగరి యాదగిరి (75)అనారోగ్యంతో మృతిచెందగా గ్రామానికి చెందిన కోడూరు శివకుమార్ గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని చెప్పి అంత్య క్రియలకు గాను రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు పలు సేవా కార్యక్రమాలతో మానవతా దక్పథంతో చాటుకుంటున్న కోడూరు శివకుమార్ గౌడ్ ను గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఈకార్యక్రమంలో ఉప్పరి రఘుపతి, ఉప్పరి యాదగిరి, చెవిటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మహబూబాబాద్
సోమవారం జులై 15, 2024 www.navatelangana.com

సామాజిక ఉద్యమాలకు
గుగులోత్ కిషన్‌నాయక్ స్ఫూర్తి
ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్



నవతెలంగాణ-మహబూబాబాద్

సామాజిక ఉద్యమాలకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుగులోత్ కిషన్ నాయక్ స్ఫూర్తిదాయకమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్ అన్నారు. ఆదివారం మహబూబాబాద్ పట్టణంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో దళిత గిరిజన ఉపాధ్యాయ బంధుమిత్రుల సారధ్యంలో సామాజిక ఉద్యమకారుడు గూగులోత్ కిషన్ నాయక్‌ను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిదిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ కిషన్‌నాయక్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఉంటూ అనేక సంవత్సరాలుగా పేదలకు విద్యార్థులకు, బడుగు బలహీనవర్గాలకు సేవలందించినట్టు చెప్పారు. ఆయన తండ్రి హతిరామ్‌నాయక్ ఆశయ సాధన కోసం పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో బడుగు బలహీన వర్గాలకు జరిగే అన్యాయాలను ఎదురించిన గొప్ప సామాజిక ఉద్యమకారుడు కిషన్‌నాయక్ అన్నారు. కిషన్‌నాయక్ స్ఫూర్తితో సామాజిక ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మెన్ మార్నేని వెంకన్న, ప్రొఫెసర్ డాక్టర్ బద్రునాయక్, టీపీఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు టీపీటీఎఫ్ చెంచు శ్రీశైలం, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు సంక బద్రినారాయణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షులు ఎండీ ఇక్బాల్, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఖుర్షీద్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమాజ సేవ కోసం ముందుకు రావాలి
లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-మహబూబాబాద్

సమాజ సేవకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మహబూబాబాద్ లయన్స్ క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా పరిధి సికింద్రాబాద్ గ్రామపంచాయతీలోని ఆదరణ వృద్ధుల ఆశ్రమంలో మురుగన్ (45) అనే వ్యక్తి ఆదివారం మృతిచెందాడు. కాగా మృతదేహాన్ని మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. సమాచారం తెలుసుకున్న తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతలు సంఘం , లయన్స్ క్లబ్ ఆఫ్ మహబూబాబాద్ నేతృత్వంలో మహబూబాబాద్ మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని అప్పగించారు. ఈ సందర్భంగా దాతలు సంఘం జిల్లా అధ్యక్షుడు పరకాల రవీందర్ రెడ్డి, క్లబ్ అధ్యక్షులు యాళ్ల మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ.. మెడిసిన్ విద్యార్థుల పరిశోధనలకు మృతదేహాలు ఉపయోగ పడుతాయన్నారు. మృతదేహాలను కాల్చడం, పాతి పెట్టడంతో సరిపెట్టుకోకుండా ఇలా మెడికల్ కళాశాలలకు అప్పగించాలని కోరారు. అనంతరం ఆశ్రయం వ్యవస్థాపక అధ్యక్షులు లోకేష్‌నాయక్, పార్వతికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రావుల రవిచందర్ రెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, క్లబ్ సెక్రటరీ చాడా అశోక్ రెడ్డి, సీనియర్ బాధ్యులు కాశీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సమ్మి గౌడ్ ఫౌండేషన్



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

కేసముద్రం మండలం కేసముద్రం పట్టణంలోని జమాలాపురానికి చెందిన పోరండ్ల సునిత ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు సమ్మి గౌడ్ ఫౌండేషన్ చేయూతనిచ్చి అండగా నిలిచింది. సునిత భర్త వీరయ్యను, కుమార్తె రాజలక్ష్మి కుమారులు రాజు, రాజా వర్ధన్‌ను పరామర్శించారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, రూ.2,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ అయూబ్ ఖాన్ మాట్లాడుతూ... మండల పేద ప్రజలకు సమ్మిగౌడ్ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు,గండి వీరేందర్, కొండేటి కళాధర్,మాజీ వార్డు సభ్యులు బానోత్ బాలు నాయక్, జల్లంపల్లి సుధాకర్, మిట్ట గడుపుల జలంధర్,జల్లంపల్లి శ్రీకాంత్,మచ్చ వెంకటేష్, ఈదుల బిక్షపతి, మోరపాక సామేల్,ఈదుల ప్రభాకర్, కమలమ్మఆశా కార్యకర్త బరిగల మణి, తదితరులు పాల్గొన్నారు.

18న సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్
సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ సారథి



నవతెలంగాణ-కేసముద్రం రూరల్

ఈనెల 18న కురవిలో జరిగే సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం మతతత్వ విధానాలతో, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, దేశ సంపదను దోచుకుంటుందన్నారు. కార్మిక చట్టాలను సవరిస్తూ పెట్టుబడిదారులు కార్మికుల శ్రమను దోచే విధంగా చట్టాలను తయారు చేస్తుందన్నారు. రాష్ట్ర విభజన హామీలు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయకుండా దాట వేస్తుందన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా నిర్మాణ కౌన్సిల్‌లో భవిష్యత్ కార్యక్రమం రూపొందిస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. వివిధ మండలాల కౌన్సిల్ సభ్యులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు : ఎస్సై

నవతెలంగాణ-గార్ల

తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు దుర్భాషలాడమే కాకుండా చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తి పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జీనత్ కుమార్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రం లోని అంబేద్కర్‌నగర్ కు చెందిన మహిళ బోడ పార్వతి మూడు సంవత్సరాల క్రితం మండలంలోని అంజనా పురం గ్రామానికి చెందిన గుగులోత్ మధుకు రూ.3లక్షలు అప్పుగా ఇచ్చింది. తిరిగి తన డబ్బులు తనకు ఇవ్వాలని మధు ఇంటికి వెళ్ళి అడగగా కుంటిసాకులతో కాలయాపన చేశాడు. ఇదే విషయంపై నిలదీస్తే పార్వతి పట్ల దురుసుగా మాట్లాడి చంపుతానని బెదిరించాడు. బాధితురాలు పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనాథ పిల్లల మధ్య 'ప్రియరాగారెడ్డి' జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మహబూబాబాద్



లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బంధుమిత్రుల మధ్య జరుపుకునే వేడుకల్లో వచ్చే ఆనందం కంటే నా.. అనేవారు లేని అనాథ పిల్లల మధ్య జరుపుకుంటే వచ్చే ఆనందం అంతా.. ఇంతా కాదు అని లయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ రావుల రవిచందర్‌రెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు పరకాల రవీందర్‌రెడ్డి-లక్ష్మి దంపతుల కుమార్తె మర్రి ప్రియరాగారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం మానుకోట లోని దైవకృప అనాథశరణాలయంలో లయ న్స్ క్లబ్ అధ్యక్షులు యాళ్ల మురళీధర్‌రెడ్డి అధ్యక్షతన అనాథ పిల్లల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అవసరమైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రటరీ అనుమాల వెంకటేశ్వర్లు, క్లబ్ సెక్రటరీ చాడా అశోక్ రెడ్డి, సీనియర్ సభ్యులు చౌడవరపు సుధాకర్, మాలె కాశీనాథ్, పరకాల ఇంద్రనీల్ రెడ్డి, వాకర్స్ క్లబ్ సభ్యులు భోనగిరి గంగాధర్ నాథ్, కొల్లూరి రవికుమార్, మాలె హేమచందర్, దైవకృప ఆనాథ శరణాలయం నిర్వాహకులులి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా హెల్త్ వెల్నెస్ సెంటర్లు

- నిర్మించి ఏండ్లు గడుస్తున్నా ప్రారంభించని వైనం
- అందుబాటులోకి వస్తే ప్రకృతి వైద్యం, యోగాపై శిక్షణ
- ఉపయోగంలోకి తేవాలని ప్రజల వేడుకోలు

నవతెలంగాణ-తొర్రూరు

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో ఆయుష్ వెల్నెస్ సెంటర్లను ఏర్పాటు చేశారు. యోగా శిక్షణ ద్వారా రోగాలు రాకుండా చూడడం, వస్తే త్వరగా నయం చేయడం, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యాన్ని అందించి దీర్ఘకాలిక వ్యాధులనుంచి ఉపశమనం కలిగించేందుకు వెల్నెస్ సెంటర్‌లు దోహదపడతాయి. అయితే వెల్నెస్ సెంటర్లను నిర్మించి వదిలేశారు. వాటిని ప్రారంభించకపోవడంతో ప్రజలకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లాలో 10 హెల్త్ వెల్నెస్ సెంటర్లు నిర్మించారు. 2022-23లో నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా ఒక్కొక్క సెంటర్ నిర్మాణానికి రూ.6లక్షలు వెచ్చించారు. తొర్రూరులో ఒకటి, వడ్డే కొత్తపల్లిలో ఒకటి, చిన్న ముప్పారం ఒకటి, పెద్ద ముప్పారం ఒకటి, గార్ల మండలం ముల్కనూరులో ఒకటి, బయ్యారం ఒకటి, డోర్నకల్ మండలం మన్నెగూడలో ఒకటి, మహ బూబాబాద్ మండలం జమాండ్లపల్లిలో ఒకటి, గూడూరు మండలం గూడూరులో ఒకటి, కొరివి మండలం కొరివిలో ఒకటి నిర్మించారు. ఆయుష్ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేకపోవడం, వైద్యులు, సిబ్బంది, మందుల కొరత వంటి సమస్యలతో వైద్య సేవలు పొందేందుకు ప్రజలు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో వెల్నెస్ కేంద్రాల ఏర్పాటుతో సమస్యలను అధిగమిం చొచ్చని ప్రభుత్వం భావించింది. కానీ కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అవి నిరుపయోగంగా ఉండటమే కాకుండా ప్రజలకు ఎలాంటి వైద్య సేవలు అందుబాటులోకి రాని పరిస్థితి నెలకొంది. అలాగే యునాని, ఆయుర్వేద, హెూమియో ఆస్పత్రులకు అనుబంధంగా హెల్త్ వెల్నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. యోగా షెడ్, తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యం కల్పించారు. దీర్ఘ కాలిక బీపీ, షుగర్, అస్తమా, కీళ్లనొప్పులు, వాపులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు శ్వాసకోశ, జీర్ణకోశ వ్యాధులు, పక్షవాతం తదితర వైద్య సేవలు అందించాలని నిర్ణయించారు. ఆయుర్వేదం ప్రకృతి వైద్యంపై శిక్షణ యోగ, ఫిజియోథెరపీ, ఆరోగ్య సూత్రాలు, సలహాలు, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాలని భావించారు. కానీ, హెల్త్ వెల్నెస్ సెంటర్ల నిర్మాణం పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది.



సిబ్బంది నియామకాలు ఏవీ?

ప్రతి హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో యోగా శిక్షకుడు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, పారామెడికల్ సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు నియామకాలు చేపట్టలేదు. యోగా శిక్షణ కేంద్రాలు నిర్మించి రెండేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో యోగా శిక్షకులను తీసుకోవాలని నిర్ణయించిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో నిర్మించిన హెల్త్ వెల్నెస్ సెంటర్‌లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా వినియోగంలోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు రాలేదు



హెల్త్ వెల్నెస్ సెంటర్ల నిర్వహణపై ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. ఆయుష్ ఆసుపత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేసిన హెల్త్ వెల్నెస్ కేంద్రాల్లో ఆశా వర్కర్లకు శిక్షణ ఇచ్చి యోగ ఇన్స్టక్టర్లను నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కేంద్రాలను ప్రారంభించి వైద్య సేవలు అందిస్తాం.

-డాక్టర్ డి విజయేందర్, ఇన్‌చార్జి సీనియర్ మెడికల్ ఆఫీసర్, తొర్రూరు

పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తా..

- జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్‌నాయక్

నవతెలంగాణ-గూడూరు

ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల సమస్యలు పరిష్కరిస్తానని జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. ఆదివారం గూడూరు మండలంలోని సీతానగరం గ్రామంలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాలను హుస్సేన్ నాయక్ సందర్శించారు. పాఠశాల పరిసరాలతోపాటు తరగతి గదులను పరిశీలించారు. అనంతరం వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరగా ఆయన స్పందించి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం మండలంలోని మర్రిమిట్ట గ్రామంలో జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట మండల స్పెషల్ ఆఫీసర్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మంకిడి ఎర్రయ్య, ఏసీఎమ్ఓ ఈరులాల్, పాఠశాల పీజీహెచ్ఎం గంగు నాయక్, తదితరులు ఉన్నారు.

హుస్సేన్‌నాయక్‌కు సన్మానం

జాతీయ ఎస్టి కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్‌ను గూడూరు టౌన్ ఎస్సీకాలనీ మాదిగ కులసంఘం నాయకులు, మచ్చర్ల గ్రామంలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళితరత్న బోడఎల్లయ్య, నాయకులు బోడవెంకన్న, నమిలి సాంబయ్య, జేరుపోతుల సాంబయ్య, సప్పట్ల రాము , పసునూరి రత్నం, కొమ్ముల శ్రీనివాస్, జన్ను నరసయ్య, హెచ్చు సునిల్, పోలేపాక వెంకట్రాం నరసయ్య, ఎల్లంకి వినయ్, తుళ్ల లక్ష్మణ్, సదిరం విష్ణు, జన్ను యాకయ్య పాల్గొన్నారు.





ప్రభుత్వ ఆస్పత్రి సమస్యలు పరిష్కరించాలి

- నేడు ఐద్వా అధ్వర్యంలో నిరాహార దీక్షలు
- జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత

నవతెలంగాణ-గార్ల

స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో పూర్తి స్థాయిలో వైద్య అధికారులు, సిబ్బందిని నియమించాలని నేడు స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రి ఎదుట మూడు రోజుల పాటు నిరాహార దీక్షలు చేపడుతున్న నట్లు ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత తెలిపారు. మండల కేంద్రం లోని మంగపతిరావు భవనంలో అలవాల సత్యవతి అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన ఐద్వా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. 30 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో వైద్య అధికారులు, సిబ్బంది లేక మండల ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేక సార్లు అధికారులకు,ప్రజాప్రతినిధులకు విన్నవించినా, అందోళనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించక పోవడంతో మహిళల అధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరాహార దీక్షలకు మహిళ సంఘాలు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షురాలు మల్లెల నాగమణి, నాయకులు తాళ్లపల్లి రమా, బాడిషా లక్ష్మీ, బానోత్ ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.



15,16,17 తేదీల్లో కేవీపీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డి రాంమ్మూర్తి

నవతెలంగాణ-మహబూబాబాద్

హనుమకొండలో ఈనెల 15, 16, 17 తేదీల్లో జరిగే కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డేల రాంమ్మూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా మందుల మహేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కేవీపీఎస్ మహబూబాబాద్ జిల్లా కమిటీ సమావేశంలో రాంమూర్తి పాల్గొని మాట్లాడారు. శిక్షణా తరగతులు హన్మకొండలో ఉంటాయని, జిల్లా ప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు పులిపాక నాగరాజు, రవి, కిషన్, హేమానాయక్, తదితరులు పాల్గొన్నారు.



యువత మత్తు పదార్థాల జోలికెళ్లొద్దు

పోలీస్ కళాజాతా కార్య క్రమం

నవతెలంగాణ- మరిపెడ



యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండా లని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆదేశాలతో మరిపెడ పోలిస్ స్టేషన్ పరిధి శనివారం రాత్రి బురహంపురం గ్రామంలో పోలిస్ కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కళాబృందం ఆధ్వ ర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ-2 జి సంతోష్ మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండా లని గంజాయి, గుడుంబా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గ్రామాలలో సీసీ కెమెరాల ఆవశ్యకత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండ లని, బాల్య వివాహాలు-అనర్థాలు, సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, రోడ్డు భద్రతా నిబంధనలు, తదితర వాటి పట్ల అవగాహన కల్పించారు. గ్రామంలో అపరిచిత వ్యక్తుల సమాచారం ఉంటే పోలీసులకు గాని, డయల్ 100కు గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని అన్నారు. ఎవరైనా గుట్కాలు, గంజాయి అమ్మినట్లు తెలిస్తే పోలీసులకు తెలపాలని అన్నారు. వాహనదారులు రోడ్డు నిబం ధనలు పాటించాలని సూచించారు. కళాబృందం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనరల్ బోగీల పెంపు నిర్ణయం అభినందనీయం
సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్

నవతెలంగాణ-మహబూబాబాద్

రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడం- విజయవాడ డివిజన్ నుంచి ప్రకటన రావడం అభినందనీయమని జనరల్ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. దేశంలోని అన్ని రైల్వే డివిజన్ కేంద్రాల నుండి ఈ ప్రకటన కార్యరూపం దాల్చే వరకు ఉత్తరాల ఉద్యమం నిరంతరం కొనసాగు తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ జనరల్ భోగీలను పెంచాలనే ఆకాంక్షను ఉత్తరాల ద్వారా, ట్విట్టర్ ద్వారా నిరంతరం తెలపాలని అశోక్ అన్నారు.

సమస్యలు పరిష్కరించాలి
ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయీస్ ఫెడరేషన్



నవతెలంగాణ-గూడూరు

తమ సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరారు. ఆదివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్‌నాయక్ ను మండలంలోని మచ్చెర్ల గ్రామంలోని ఆయన నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అనంతరం పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీఓ-3 చట్టం కోసం జాతీయస్థాయిలో తీర్మానించాలని, ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులలో 317జీఓతో ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలని కోరారు. ఐటీడీఏ పరిధి స్థానిక గిరిజనులతోనే ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని అన్నారు. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలో కొత్త పోస్టులు మంజూరు చేయాలని కోరారు. గూడూరు మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల(బాలురు)లో సరైన వసతులు లేవని, భవన సముదాయం ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవల పంచాయతీరాజ్ శాఖలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల మాదిరిగానే ఐటీడీఏ పాఠశాలలో కూడా భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పదోన్నతి కల్పించాలని కోరారు సానుకూలంగా స్పందించిన ఆయన గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పెనుక ప్రభాకర్, ఏఐఏఈఎఫ్ రాష్ట్ర నాయకులు బత్తుల శ్రీనివాస్, ఆట గూడూరు మండల అధ్యక్షులు ముయ్యబోయిన వెంకన్న, ఐలబోయిన వీరయ్య, దబ్బకట్ల రమేష్, ఊకే లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఉద్యానవన శాఖ అధికారి రాకేష్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా అరిపిరాల గ్రామంలో రైతు తక్కలపల్లి శ్రీపాదరావు పంట పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంట నూనెలు, దేశ స్వయం సమృద్ధికి పామాయిల్ విస్తీర్ణాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 7100 ఎకరాలలో ఆయిల్‌పామ్ విస్తీర్ణం ఉన్నదని, 300 పైచిలుకు ఎకరాలలో పంట దిగుబడులు ప్రారంభమై రైతులు ఆదాయం పొందుతున్నట్టు చెప్పారు. అనంతరం ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని ఉద్యాన శాఖ, ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పంప్ ఫీల్డ్ ఆఫీసర్స్ వెంకన్న, అవినాష్, అనిల్, మరియు రైతులు సదాకర్, లింగన్న, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు స్వచ్ఛ సంతోష్, తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత

నవతెలంగాణ -ఇనుగుర్తి

విద్యుద్ఘాతంతో గేదె మృత్యువాత పడిన సంఘటన మండలంలోని చిన్ననాగారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే... చిన్ననాగారం గ్రామంలో రైతు నాయిని మల్లయకు చెందిన గేదె మేతకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. అప్పుచేసి రూ.80,000కు గేదెను కొన్నానని, గేదె మృతితో తాను రోడ్డున పడ్డానని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని కోరాడు.